సంపుటి : 9
సంచిక : 278
సోమవారం
29 జూన్ 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE




Contact For Ads:
7579339999

# మంచంపట్టిన దుగ్గుదూరు..

## కలుషిత ఆహారంతో 70 మంది ఆసుపత్రి పాలు!

- 'చల్లపునుకులు' తిని ఒకేసారి వాంతులు, విరేచనాలు..
- పరుగులు తీసిన వైద్యారోగ్య శాఖ
- పీహెచ్‌సీలో 32 మంది, కాకినాడ, యానం ప్రైవేట్ ఆసుపత్రుల్లో మరో 40 మందికి చికిత్స
- ఘటనా స్థలాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో నరసింహ నాయక్..
- గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు
- పడకేసిన ఫుడ్ సేఫ్టీ.. ప్రశ్నిస్తే అధికార పార్టీ నేతల 'కొమ్ముకాసే' రాజకీయం.. మేల్కొనేది ఎప్పుడు?

**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాజులూరు మండలంలోని దుగ్గుదూరు గ్రామంలో కలుషితాహారం (ఫుడ్ పాయిజన్) తిని సుమారు 70 మందికి పైగా రోగులు అస్వస్థతకు గురై ఆసుపత్రుల పాలవ్వడం స్థానికంగా పెను కలకలం రేపింది. గ్రామంలోని ఒక చిరు హోటల్ (బండి) వద్ద శుక్రవారం సాయంత్రం వేడివేడిగా దొరికే 'చల్లపునుకులు', బజ్జీలు తిన్న చిన్నపిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా వరుసగా వాంతులు, విరేచనాలు, తీవ్ర కడుపునొప్పి బారిన పడ్డారు. శుక్రవారం రాత్రికి 10 మందితో ప్రారంభమైన ఈ ప్రభావం.. శనివారం నాటికి రోగుల సంఖ్య భారీగా పెరగడంతో వైద్యారోగ్య శాఖ అధికారులు పరుగులు తీశారు. ఒకేసారి గ్రామంలో ఇంతమంది మంచాన పడటంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు లోనవుతున్నారు.

**ఆసుపత్రుల్లో రోగుల క్యూ..**

దుగ్గుదూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మిగతా .. 2లో..




రోగుల అనారోగ్యాలకు కారణమైన హోటల్

దుగ్గుదూరు పీహెచ్ సీ బిల్డింగ్

దుగ్గుదూరు పీహెచ్ సీ లో జిల్లా వైద్య అధికారుల పరిశీలన

**ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాలి — బాధితులకు న్యాయం చేయాలి**

### ప్రధాని మోదీకి సీషెల్స్
# అత్యున్నత పురస్కారం



**విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధాని మోదీకి మరో అరుదైన గౌరవ పురస్కారం లభించింది. సీషెల్స్ దేశ అత్యున్నత 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్' పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. ఆ దేశ అధ్యక్షుడు ప్యాట్రిక్ హెర్మినీ ఆయనకు అవార్డు అందజేశారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, సుస్థిర అభివృద్ధి సాధించడంలో ప్రపంచ దేశాలకు నాయకత్వం వహిస్తున్నందుకుగానూ సీషెల్స్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది. దీనిపై ప్రధాని మోదీ స్పందిస్తూ సీషెల్స్ దేశ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తున్న భారత ప్రజలందరికీ ఈ అవార్డును అంకితం చేస్తున్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. "ఈ అవార్డును అత్యంత గౌరవంగా స్వీకరిస్తున్నా. వాతావరణ మార్పులతో సతమతమవుతూ, పర్యావరణ పరిరక్షణకు పాటు పడుతున్న అన్ని దేశాల ప్రజలకు ఈ పురస్కారాన్ని అంకితం చేస్తున్నా. అందరూ ఏకమై పర్యావరణ పరిరక్షణకు పూనుకోవాల్సిన అవసరం ఉంది. మన గ్రహాన్ని మరింత పచ్చగా, సుస్థిరంగా మార్చేందుకు భారత్ సిద్ధంగా ఉంది. కానీ, అందుకు అన్ని దేశాలూ మిగతా .. 2లో..

# శ్రీవారి సేవలో అనంత్ అంబానీ

**టీటీడీకి రూ.27.5 కోట్లతో 25 ఎలక్ట్రిక్ బస్సులు విరాళంగా ప్రకటన**
**బస్సుల నిర్వహణ, డ్రైవర్ల జీతాలు కూడా తామే భరిస్తామని వెల్లడి**



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ నేడు తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన టీటీడీకి భారీ విరాళం ప్రకటించారు. తిరుమల ఘాట్ రోడ్లలో పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా రూ.27.5 కోట్ల వ్యయంతో 25 ఎలక్ట్రిక్ బస్సులను విరాళంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇవాళ తెల్లవారుజామున ఆలయానికి మిగతా .. 2లో..

### పిల్లల ఆలనా పాలనా
# తల్లికి మాత్రమే పరిమితం చేయకూడదు

**పల్స్ పోలియో కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు**




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల టీకాలను నిర్ణీత సమయానికి తప్పనిసరిగా వేయించాలని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా సీఎం క్యాంపు కార్యాలయంలో చిన్నారులకు ఆయన పోలియో చుక్కలు వేశారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో సీఎం ఆప్యాయంగా మాట్లాడారు. పిల్లలను ఎత్తుకుని కాసేపు ఆడించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి, వ్యాక్సినేషన్ వివరాలను తెలుసుకున్నారు. ఉద్యోగం, ఉపాధికి వెళుతున్న మహిళలు పిల్లల పెంపకంలో ఎలా సమన్వయం చేసుకుంటున్నారని తల్లిదండ్రులను చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. ఇంట్లో భర్త, మగవాళ్లు కూడా ఈ విషయంలో బాధ్యత తీసుకోవాలన్నారు. పిల్లల్ని కని, పెంచడం, వారి ఆలనా పాలనా చూసుకోవడం మిగతా .. 2లో..

### అది ప్రభుత్వమా..
# గూండాల రాజ్యమా?

**అమరావతిలో వైసీపీ నేతలపై జరిగిన దాడిని ఖండించిన జగన్**
**చంద్రబాబే ఈ దాడిని ఉసిగొల్పారని తీవ్ర ఆరోపణ**
**ఈ దుష్ట సంప్రదాయానికి రెట్టింపు స్పందన ఉంటుందని హెచ్చరిక**



**తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ప్రభుత్వం నడుపుతున్నారా లేక గూండాల రాజ్యాన్ని కొనసాగిస్తున్నారా? అంటూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమరావతిలో పర్యటిస్తున్న వైసీపీ మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ దాడులను చంద్రబాబే స్వయంగా ఉసిగొల్పారని ఆరోపిస్తూ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా మిగతా .. 2లో..

### అమరావతిలో ప్రజల తిరుగుబాటుతో
# వైసీపీ తోక ముడిచింది
## మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** అమరావతిలో జరిగిన ప్రజా తిరుగుబాటుతో వైసీపీ అల్లరి మూకలు తోక ముడిచాయని, వారి కుట్ర రాజకీయాలను స్థానిక మహిళలు, రైతులే సమర్థంగా తిప్పికొట్టారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. కుట్రల ముసుగులో మరోసారి ప్రజలను మోసం చేయాలని ప్రయత్నించిన వైసీపీ నేతలను అమరావతి వాసులు గట్టిగా నిలదీసి వెనక్కి పంపారని ఆయన పేర్కొన్నారు. రాజకీయాల పేరుతో నేరాలకు పాల్పడే వారిని ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని, ఈ విషయంలో ప్రభుత్వం, ప్రజలు ఒకే స్పష్టతతో మిగతా .. 2లో..

# అంబటి, పేర్ని నానిలపై అట్రాసిటీ కేసులు

**తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో పలువురు వైసీపీ నేతలపై ఫిర్యాదులు**



**తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసులు నమోదయ్యాయి. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నాని సహా పలువురు నేతలపై నిన్న కేసులు నమోదు కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. పోలీసుల నివేదికల ప్రకారం, తాడేపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ మంత్రి మిగతా .. 2లో..

# పేదలకు ఉపాధి కల్పిస్తే ఓర్వలేరా జగన్?

## విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** స్మార్ట్ కిచెన్ల ద్వారా ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు మంచి రుచికరమైన భోజనం పెడుతుంటే వైకాపా అధినేత జగన్ ఓర్వలేకపోతున్నా రని విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా మహిళలు, పేదలకు ఉపాధి కల్పిస్తుంటే జగన్ తట్టుకోలేకపోతున్నారన్నారు. కడప జిల్లాలో 5 స్మార్ట్ కిచెన్లను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టామని.. హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, హెల్పర్లు, డ్రైవర్లకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. వీటితోపాటు జిల్లాలో 33 స్మార్ట్ కిచెన్లు ఏర్పాటుచేసి 392 మందికి మిగతా .. 2లో..

### ఫేక్ ప్రచారాలకు
# బ్రాండ్ అంబాసిడర్ జగన్
## మంత్రి నిమ్మల రామానాయుడు



**పాలకొల్లు, విశ్వం వాయిస్ న్యూస్ :** మూడు దశాబ్దాల క్రితం వెలిగొండ ప్రాజెక్టుకు భూమి పూజ చేసిన చంద్రబాబే.. దానిని పూర్తి చేసి ప్రజలకు నీరందించబోతున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. దీంతో స్థానికంగా ఫ్లోరైడ్ సమస్యకూ ముగింపు పడుతుందని చెప్పారు. పాలకొల్లులో ఆయన మీడియాతో మాట్లాడారు. "రూ.5 వేల కోట్లకుపైగా విలువైన పనులు మిగిలి ఉన్నా.. వెలిగొండను జాతికి అంకితం చేసి, వెనుకబడిన ప్రకాశం జిల్లా రైతులను గొడ్డలి పార్టీ నేత మోసం చేశారు. అబద్ధాలు, ఫేక్ ప్రచారాలకు బ్రాండ్ అంబాసిడర్ జగన్‌రెడ్డి. దోపిడీలు, హత్యలు, మిగతా .. 2లో..

# అమెరికా వరదల్లో తెలుగు యువకుడు గల్లంతు

**ఆచూకీ కోసం చర్యలు చేపట్టాలంటూ కేంద్ర, రాష్ట్ర మంత్రులకు ఎమ్మెల్యే ఏలూరి విజ్ఞప్తి**



**పర్చూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికాలో వరదల్లో గల్లంతైన బాపట్ల జిల్లాకు చెందిన యువకుడి ఆచూకీ కోసం చర్యలు తీసుకోవాలని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు కోరారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర మంత్రులకు ఆయన లేఖలు రాశారు. పర్చూరు మండలం దేవరపల్లికి చెందిన దొప్పలపూడి రాంబాబు కుమారుడు వెంకటేశ్ ప్రస్తుతం అమెరికాలోని ఒమాహా నగరంలో మిగతా .. 2లో..




### కేసీఆర్ కుటుంబాన్ని
# ప్రజలు శాశ్వతంగా బహిష్కరించారు
## తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి



**నల్గొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** పదేళ్లు పదవులు అనుభవించి రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలు శాశ్వతంగా బహిష్కరించారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎంతోమంది త్యాగాలు చేసి రాష్ట్రాన్ని సాధిస్తే.. పదవులు మాత్రం కేసీఆర్ కుటుంబం అనుభవించిందని విమర్శించారు. ఆ కుటుంబానికి మళ్లీ అధికారం మిగతా .. 2లో..

# తెలంగాణ ప్రజలకు భాజాపాపై నమ్మకముంది

## బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ ప్రజలకు భాజపాపై నమ్మకముందని.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. ఆ నమ్మకాన్ని పార్టీ బూత్ అధ్యక్షులు ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో భాజపా బూత్ అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. "సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# మంచంపట్టిన దుగ్గుదూరు..

రెండు రోజులుగా 32 మంది రోగులు డయేరియా (విరేచనాలు), తదితర లక్షణాలతో చేరారు. వీరిలో 23 మందిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకుని వైద్యం అందిస్తుండగా, మిగతా 9 మంది అవుట్‌పేషెంట్లుగా చికిత్స పొందుతున్నారు. వీరితో పాటు సుమారు 40 మంది రోగులు ద్రాక్షారామ, రామచంద్రపురం, యానం, కాకినాడ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్నట్లు చెబుతున్నారు.

**రంగంలోకి డీఎంహెచ్‌వో.. మెరుగైన వైద్యానికి ఆదేశం**

విషయం తెలుసుకున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరసింహ నాయక్, జిల్లా మలేరియా అధికారి ప్రభాకరరావులతో కలిసి శనివారం దుగ్గుదూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అత్యవసరంగా సందర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని స్థానిక వైద్యాధికారిణి డాక్టర్ సుప్రియను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అవసరమైతే తక్షణమే కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించాలని సూచించారు. ప్రస్తుతం బాధితుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు డాక్టర్ సుప్రియ తెలిపారు. ఘటనకు గల కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు. ఆహారం విషంగా మారడం లేదా తాగునీరు కలుషితం కావడం వల్లే ఈ ఘోరం జరిగిందా అనే కోణాల్లో అధికారులు ఆరా తీస్తున్నారు.

**క్షేత్రస్థాయిలో 'సున్నా' తనిఖీలు.. నిద్రపోతున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు!**

ఈ ఘోర ప్రమాదం వెనుక ఆహార భద్రతా విభావం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. జిల్లాలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల వ్యవస్థ ఎక్కడా పనిచేస్తున్నట్లు కనిపించడం లేదు.

రసాయనాల వాడకం: రోడ్ల పక్కన, హోటళ్లలో వాడే ఘోరమైన రసాయనాలు, నాణ్యత లేని నూనెలు, కుళ్లిన పిండి పదార్థాలపై నిరంతరం నిఘా పెట్టాల్సిన అధికారులు ఏసీ గదులకే పరిమితమయ్యారు.

**మామూళ్ల మత్తు:** నాణ్యతా ప్రమాణాలు పరిశీలించకుండా, కేవలం 'మామూళ్ల' మత్తులో మునిగి తేలుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**కంటితుడుపు చర్యలు:** ఏదైనా ప్రమాదం జరిగి 70 మంది ఆసుపత్రి పాలైనప్పుడు మాత్రమే వచ్చి హడావుడి చేయడం, ఆ తర్వాత మళ్లీ పాత పద్ధతికే ప్రాధాన్యత ఇవ్వడం అధికారులకు పరిపాటిగా మారింది.

**ప్రశ్నిస్తే 'కొమ్ముకాసే' అధికార పార్టీ నేతలు!**

ఈ అక్రమ వ్యాపారాలు, కలుషితాహార విక్రయాల వెనుక అధికార పార్టీల రాజకీయ అండదండలు పుష్కలంగా ఉన్నాయనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. "గ్రామాల్లో లేదా పట్టణాల్లో నిబంధనలు ఉల్లంఘించి ప్రజల ప్రాణాలతో ఆడుకునే వ్యాపారాలపై స్థానికులు తిరగబడినా, లేదా అధికారులు చర్యలు తీసుకోబోయినా.. అధికార పార్టీ నేతలు రంగంలోకి దిగిపోతున్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమో, వ్యక్తిగత ప్రయోజనాల కోసమో తప్పు చేసిన వారికి అండగా నిలబడుతూ, వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారు." ఫలితంగా, తప్పు చేసిన వారిలో భయం పోయి, ప్రజల ప్రాణాలతో యథేచ్ఛగా చెలగాటమాడుతున్నారు.

**ప్రజాప్రతినిధులూ.. అధికారులూ.. ఇకనైనా స్పందించండి!**

దుగ్గుదూరు ఘటన ఒక తీవ్రమైన హెచ్చరిక లాంటిది. 70 మంది ప్రాణాలు తృటిలో తప్పించుకున్నాయి. రేపు ఇదే నిర్లక్ష్యం కొనసాగితే మరిన్ని ప్రాణాలు గాల్లో కలవడం ఖాయం.

**తక్షణ డిమాండ్లు:**

కాజులూరు మండలంతో పాటు కాకినాడ జిల్లా వ్యాప్తంగా ఉన్న హోటళ్లు, రోడ్‌సైడ్ బండ్లపై తక్షణమే ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు నిరంతర దాడులు నిర్వహించాలి.

నాణ్యత లేని వస్తువులతో కలుషితాహార విక్రయాలు జరిపే వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

రాజకీయ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఇలాంటి ప్రాణాంతక వ్యాపారాలకు కొమ్ముకాయడం మానుకోవాలి.

ప్రజల ప్రాణాల కంటే రాజకీయం, మామూళ్లు ముఖ్యం కాదని ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు గుర్తించాలి. దుగ్గుదూరు బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు చేపట్టాలని పత్రికా ముఖంగా డిమాండ్ చేస్తున్నాం.

## ప్రధాని మోదీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం

ముందుకు రావాలి. అప్పుడే అది సాధ్యపడుతుంది" అని మోదీ పేర్కొన్నారు. వాతావరణ పరిరక్షణ అంశంలో ప్రధాని మోదీకి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం ఇదే తొలిసారి కాదు. ఆహార భద్రత, వ్యవసాయంలో తీసుకొస్తున్న మార్పులు, సుస్థిర అభివృద్ధి తదితర అంశాల్లో ఆయన చేసిన కృషికి గానూ మే 2026లో ప్రపంచ వ్యవసాయ, ఆహార సంస్థ (ఎఫ్ఏఓ) ఆయనకు 'అగ్రికోలా మెడల్'ను బహూకరించింది. 2018లో సుస్థిర ఆర్థికాభివృద్ధి, ప్రపంచ సహకారం, సమ్మిళిత అభివృద్ధి రంగాల్లో ఆయన సేవలకుగానూ సియోల్ శాంతి బహుమతి వరించింది. అదే ఏడాది ఐక్యరాజ్యసమితి.. 'ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్' అవార్డుతో సత్కరించింది.

## శ్రీవారి సేవలో అనంత్ అంబానీ

చేరుకున్న అనంత్ అంబానీ, శ్రీవారి సుప్రభాత సేవలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు. టీటీడీ అధికారులు శేషవస్త్రంతో సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా టీటీడీ అధికారులతో సమావేశమైన అనంత్ అంబానీ, తిరుమలలో జరుగుతున్న సేవా కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ భేటీలోనే ఆయన భారీ విరాళంపై ప్రకటన చేశారు. కేవలం ఎలక్ట్రిక్ బస్సులను అందించడమే కాకుండా వాటి నిర్వహణకు అవసరమైన ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కూడా నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా ఈ బస్సులను నడిపే డ్రైవర్ల జీతభత్యాలను సైతం పూర్తిగా రిలయన్స్ సంస్థే భరిస్తుందని స్పష్టం చేశారు. అనంత్ అంబానీ తీసుకున్న ఈ నిర్ణయంపై టీటీడీ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు వారాంతం కావడంతో తిరుమలలో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగింది. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి దాదాపు 24 నుంచి 26 గంటల సమయం పడుతోంది. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని, సాధారణ భక్తులకు ప్రాధాన్యత ఇచ్చేందుకు సోమవారం నాటి వీఐపీ బ్రేక్ దర్శనాలతో పాటు శ్రీవాణి దర్శనాలను కూడా రద్దు చేస్తున్నట్లు టీటీడీ ప్రకటించింది.

## తల్లికి మాత్రమే పరిమితం చేయకూడదు

తల్లికి మాత్రమే పరిమితం చేయకూడదన్నారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉంటే పిల్లల పెంపకంలో భాగస్వాములు అయ్యేవారని చెప్పారు. పిల్లలను విలువలతో పెంచడంలో నాడు అమ్మమ్మలు, తాతయ్యలు, ఇతర కుటుంబ సభ్యులు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషించేవారని గుర్తుచేశారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చాలా బలమైనదన్నారు. అలాంటి వ్యవస్థ మళ్లీ రావాలని చంద్రబాబు ఆకాంక్షించారు. సంతానాన్ని సమస్యగా, భారంగా చూసే విధానం పోవాలన్నారు. సంతానం అంటే సంపద అనే పరిస్థితి వస్తోందని చెప్పారు. అందుకే ఇద్దరు అంత కంటే ఎక్కువ మంది పిల్లలు ఉండేలా ప్రభుత్వ పరంగా కూడా ప్రోత్సహిస్తున్నామన్నారు.

## అది ప్రభుత్వమా.. గూండాల రాజ్యమా?

ఆయన వరుస పోస్టులు చేశారు. రాజధాని ప్రాంత రైతుల ఆహ్వానం మేరకు సీఆర్డీయే పరిరక్షణ కమిటీతో కలిసి వెళ్తున్న తమ పార్టీ నేతలపై దాడి చేయించడం ద్వారా పట్టపగలే ప్రజాస్వామ్యాన్ని హననం చేశారని జగన్ మండిపడ్డారు. కొందరు పోలీసు అధికారులు దగ్గరుండి ఈ దాడిని సమన్వయం చేయడం అత్యంత దారుణమని విమర్శించారు. అమరావతి పేరుతో జరుగుతున్న అవినీతి, రైతులపై సాగుతున్న దౌర్జన్యాలు బయటపడకుండా ఉండేందుకే ఇటువంటి దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. భూములు ఇవ్వని రైతులను భూసేకరణ నోటీసులతో వేధించడం, వారి పొలాలకు వెళ్లే మార్గాలను ధ్వంసం చేయడం, అక్రమంగా మట్టి తవ్వకాలు జరపడం వంటి దారుణాలకు ప్రభుత్వం ఒడిగడుతోందని జగన్ ఆరోపించారు. కొండవీటి వాగు నీటిని బలవంతంగా పొలాల్లోకి మళ్లించి, రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "నేడు మీరు మొదలుపెట్టిన ఈ దుష్ట సంప్రదాయానికి, భవిష్యత్తులో రెట్టింపు స్పందన ఉంటుంది. ప్రజలు మిమ్మల్ని ఎన్నటికీ క్షమించరు," అని చంద్రబాబును హెచ్చరించారు. ఈ దాడులకు వైసీపీ తలవంచదని, అమరావతి రైతులు, బాధితులకు తమ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని జగన్ స్పష్టం చేశారు.

## వైసీపీ తోక ముడిచింది

ఉన్నారనడానికి అమరావతి ఘటనే నిదర్శనమని వ్యాఖ్యానించారు. గత ఐదేళ్ల పాలనలో మూడు రాజధానుల పేరుతో కాలయాపన చేసిన వైసీపీ ప్రభుత్వం, ఏ ఒక్క ప్రాంతంలోనూ గుప్పెడు మట్టి కూడా వేయలేదని మంత్రి గొట్టిపాటి విమర్శించారు. తమ విధ్వంసకర విధానాలతో అమరావతితో పాటు యావత్ రాష్ట్ర అభివృద్ధిని కుంటుపరిచారని తీవ్ర ఆరోపణలు చేశారు. అధికారం కోల్పోయిన తర్వాత కూడా వైసీపీ నాయకత్వం తన వైఖరి మార్చుకోలేదని, ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు రోజుకో కొత్త నాటకానికి తెరలేపుతోందని అన్నారు. ఏ అంశంపైనా స్థిరమైన వైఖరి లేకుండా కేవలం ప్రజలను మభ్యపెట్టడమే ఆ పార్టీ ఏకైక లక్ష్యంగా మారిందని దుయ్యబట్టారు. వైసీపీ ఇదే ధోరణిని కొనసాగిస్తే, ప్రజల్లో ఆ పార్టీకి మిగిలిన కొద్దిపాటి విశ్వాసం కూడా పూర్తిగా ఆవిరైపోతుందని మంత్రి గొట్టిపాటి హెచ్చరించారు. అమరావతిలో మహిళలు, రైతులు వ్యక్తం చేసిన నిరసన ప్రజల మనోభావాలకు అద్దం పట్టిందన్నారు. తమ ప్రభుత్వం అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని అడ్డుపెట్టుకుని రాష్ట్రంలో అల్లర్లు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని, అలాంటి ప్రయత్నాలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని ఆయన తేల్చిచెప్పారు. ప్రజల ప్రయోజనాలే తమకు ముఖ్యమని, ఆ దిశగానే ప్రభుత్వ పాలన సాగుతుందని మంత్రి వివరించారు.

# అభిప్రాయా అరణ్యంలో... వాస్తవాల వెలుగు!

మానవ జీవితంలో అత్యంత ప్రమాదకరమైన పొరపాటు ఏదైనా ఉంటే అది ఒక్కటే అభిప్రాయాన్ని వాస్తవంగా భ్రమించుకోవడం. ఈ పొరపాటు వ్యక్తిగత జీవితంలోనే కాదు, కుటుంబాలలో, సమాజంలో, రాజకీయాలలో, మరియు చరిత్రలో సైతం అసంఖ్యాక విపత్తులకు మూలకారణమైంది. ఒక వ్యక్తి తన మనసులో ఏర్పరచుకున్న నమ్మకం లేదా అభిప్రాయం, ఆ క్షణం నుండి అతనికి వాస్తవంగా అనిపించడం మొదలవుతుంది. కానీ ఆ వాస్తవం ఎప్పటికీ అతని అభిప్రాయానికి మాత్రమే పరిమితమై ఉంటుంది విశ్వానికి కాదు.నేటి డిజిటల్ యుగంలో సోషల్ మీడియా అనే వేదిక ఉద్భవించిన తర్వాత ఈ సమస్య మరింత తీవ్రమైంది. ఒక్క క్షణంలో లక్షలమంది వద్దకు చేరే శక్తి కలిగిన ఈ మాధ్యమాలు, అభిప్రాయాలను వాస్తవాలుగా, ఊహలను నిజాలుగా, మరియు పుకార్లను వార్తలుగా మారుస్తున్నాయి. ప్రతి ఒక్కరూ విలేకరులైన ఈ కాలంలో, నిజమైన జర్నలిజం యొక్క బాధ్యత ఏమిటో అర్థం చేసుకోవడం ఎంతో అవసరం.అభిప్రాయం అంటే ఒక వ్యక్తి యొక్క వ్యక్తిగత అనుభవాలు, విద్య, సంస్కృతి, భావోద్వేగాలు, మరియు సామాజిక నేపథ్యం ఆధారంగా ఏర్పడిన నమ్మకం. ఇది సత్యం కావచ్చు, అర్ధసత్యం కావచ్చు, లేదా పూర్తిగా అసత్యం కూడా కావచ్చు. కాలంతో, అనుభవంతో, జ్ఞానంతో అభిప్రాయం రూపు మారుతుంది. అందువల్లనే నిన్న ఒక్క విషయంలో మనం తప్పుపట్టిన వ్యక్తి, నేడు మనకు ఆదర్శంగా కనిపించవచ్చు. అభిప్రాయం అనేది మస్తిష్కంలో నివసించే ఆలోచనల సంకలనం మాత్రమే.ఉదాహరణకు, ఒక వ్యక్తి ఈ ప్రభుత్వం చాలా మంచిది అని చెప్పినప్పుడు అది ఆ వ్యక్తి అభిప్రాయం. మరొక వ్యక్తి ఈ ప్రభుత్వం చెడ్డది అన్నప్పుడు అది అతని అభిప్రాయం. రెండూ ఒకే ప్రభుత్వం గురించి చెప్పినా, భిన్నంగా ఉంటాయి. ఎందుకంటే, ఇద్దరూ ఆ ప్రభుత్వాన్ని వేర్వేరు కోణాల నుండి అనుభవించారు. కానీ ఇవి రెండూ వాస్తవాలు కావు కేవలం వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.వాస్తవం అనేది ఎవరు చూసినా, ఎప్పుడు చూసినా, ఏ కోణం నుండి చూసినా మారదు. వాస్తవం అందరికీ ఒక్కటే. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు ఇది వాస్తవం. ఇది ఒక్కో వ్యక్తి అభిప్రాయాన్ని బట్టి మారదు. నాకు సూర్యుడు పడమర నుండి ఉదయిస్తున్నట్లు అనిపిస్తోంది అని ఒక వ్యక్తి చెప్పినా, వాస్తవం మారదు. వాస్తవానికి రుజువు అవసరం ఆధారాలు, సాక్ష్యాలు, మరియు పరిశోధన ద్వారా మాత్రమే వాస్తవాన్ని నిర్ధారించవచ్చు.నేటి సమాజంలో చాలా మంది వాస్తవాన్ని రెండు రకాలుగా అర్థం చేసుకుంటున్నారు నా వాస్తవం మరియు నీ వాస్తవం. ఇది అత్యంత ప్రమాదకరమైన ధోరణి. వాస్తవం ఒక్కటే ఉంటుంది. దానికి నా లేదా నీ అని వేరు వేరు రూపాలు ఉండవు. నా వాస్తవం అని మనం చెప్పినప్పుడు, నిజంగా మనం చెప్పేది నా అభిప్రాయం మాత్రమే. ఈ రెండింటి మధ్య తేడాను గుర్తించడమే వివేకవంతమైన జీవనానికి మొదటి అడుగు.

అభిప్రాయం మరియు వాస్తవం మధ్య గందరగోళానికి అనేక కారణాలు ఉన్నాయి. మొదటిది భావోద్వేగాలు. మనం ఒక విషయాన్ని ఎంత శ్రద్ధగా, ఎంత ప్రేమతో లేదా ద్వేషంతో చూస్తామో, అంత ఎక్కువగా మన అభిప్రాయం వాస్తవంలా అనిపిస్తుంది. భావోద్వేగం మన దృష్టిని కప్పివేస్తుంది. రెండవది ధృఢీకరణ పక్షపాతం . మనం ఈపాటికే నమ్మిన విషయాలను సమర్థించే సమాచారాన్ని మాత్రమే ఆమోదిస్తాం, విరుద్ధమైన సమాచారాన్ని నిరాకరిస్తాం. సోషల్ మీడియా అల్గోరిథమ్‌లు సైతం మనకు మనం ఇష్టపడే కంటెంట్‌నే చూపించడం ద్వారా ఈ పక్షపాతాన్ని మరింత బలపరుస్తున్నాయి. మూడవది సమూహ ఒత్తిడి. మన చుట్టూ ఉన్న వారు ఒక అభిప్రాయాన్ని వాస్తవంగా చెప్పినప్పుడు, మనం కూడా దానిని వాస్తవంగా అంగీకరించే అవకాశం ఉంది. అందరూ అంటున్నారు కాట్టి అది నిజమే ఇది మనిషి సహజ ప్రవృత్తి. కానీ అందరూ నమ్మినా, వాస్తవం మారదు.నేటి భారత రాజకీయ వాతావరణంలో అభిప్రాయం మరియు వాస్తవం మధ్య సరిహద్దు దాదాపు అదృశ్యమైంది. ఒక పార్టీ మద్దతుదారుని దృష్టిలో వాస్తవం వేరేగా ఉంటుంది, మరొక పార్టీ మద్దతుదారుని దృష్టిలో వాస్తవం మరోలా ఉంటుంది. ఒకే సంఘటన, ఒకే గణాంకాలు, ఒకే విధానాలు రాజకీయ దృష్టితో చూసినప్పుడు వేర్వేరు వాస్తవాలుగా మారిపోతాయి. ఇది ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమైన పరిణామం. ఒక ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యం అభిప్రాయాల వైవిధ్యంపై నిలబడుతుంది కానీ వాస్తవాల వివాదంపై కాదు. నిరుద్యోగ రేటు, ఆర్థిక వృద్ధి, అవినీతి జరిగిందా లేదా అనేది వాస్తవాలు, అభిప్రాయాలు కావు.మనం చేయాల్సిన మొదటి అడుగు వినమ్రత. నాకు అంతా తెలుసు అనే అహంకారం కంటే నాకు ఏదైనా తెలియకపోవచ్చు అనే వినమ్రత మెరుగైనది. నాకు ఇది తప్పు అనిపిస్తోంది అని చెప్పడం, ఇది తప్పు అని ధృఢంగా ప్రకటించడం కంటే ఎంతో నిజాయితీగా ఉంటుంది. రెండవ అడుగు ఆధారాలు తనిఖీ చేయడం. ఏదైనా సమాచారం విన్నప్పుడు, వెంటనే అంగీకరించకుండా ఆధారాలను అడగడం అలవాటు చేసుకోవాలి. ఈ వార్త ఎక్కడ నుండి వచ్చింది? దీనికి ఆధారాలు ఏమిటి? అని అడగడం సందేహం కాదు వివేకం. మూడవ అడుగు భిన్న అభిప్రాయాలను గౌరవించడం. మన అభిప్రాయంతో విభేదించే వ్యక్తి తప్పక తప్పు చేస్తున్నాడని కాదు. బహుశా అతను వేరే కోణం నుండి వాస్తవాన్ని చూస్తున్నాడు.విద్యార్థులకు పాఠశాల నుండే విమర్శనాత్మక ఆలోచన నేర్పించాలి. ఇది నిజమా?,దీన్ని రుజువు చేయగలమా? అని ఆలోచించడం ప్రతి పాఠ్యక్రమంలో భాగం కావాలి. అభిప్రాయం మరియు వాస్తవం మధ్య తేడా అర్థం చేయించడం విద్య యొక్క ప్రాథమిక లక్ష్యం కావాలి. మీడియా, ముఖ్యంగా పత్రికలు మరియు వార్తా సంస్థలు, వార్తలు మరియు సంపాదకీయాల మధ్య స్పష్టమైన రేఖ గీయాలి. ఇది జరిగింది అనేది వార్త,ఇది జరగాల్సింది అనేది అభిప్రాయం.

ఈ రెండింటినీ స్పష్టంగా వేరు చేయడమే నిజాయితీగల జర్నలిజానికి పరీక్ష.ఒక్క వ్యక్తి అభిప్రాయం వాస్తవంగా మారగలిగిన నాడు, ఆ సమాజంలో అన్యాయం రాజ్యమేలుతుంది. ఒక నాయకుడి అభిప్రాయం వాస్తవంగా మారిన నాడు, ఆ రాజ్యంలో నిరంకుశత్వం వెలుగు చూస్తుంది. కానీ ఒక్కో వ్యక్తి ఇది నా అభిప్రాయం మాత్రమే, వాస్తవం కాదు అని చెప్పగలిగిన నాడు, ఆ సమాజంలో ప్రజాస్వామ్యం నిజంగా నిలబడుతుంది. అభిప్రాయం మనకు ఒక గళాన్ని ఇస్తుంది; వాస్తవం మనకు ఒక వేదికను ఇస్తుంది. అభిప్రాయం మనలను తీర్పు ఇచ్చే స్థాయికి తీసుకెళ్తుంది; వాస్తవం మనలను సత్యాన్వేషణ వైపు తీసుకెళ్తుంది. ఈ రెండింటి మధ్య తేడాను అర్థం చేసుకున్న సమాజం, నిజమైన జ్ఞానం వైపు, నిజమైన న్యాయం వైపు, నిజమైన స్వేచ్ఛ వైపు ముందుకు సాగుతుంది.కాబట్టి, ఇకపై మనం ఎప్పుడైనా ఏదైనా విషయంలో గట్టిగా ప్రకటించే ముందు ఒక్క క్షణం ఆగుదాం. మన మనసుకు ఒక్క ప్రశ్న వేసుకుందాం.ఇది వాస్తవమా, లేదా ఇది నా అభిప్రాయమా? ఆ ఒక్క ప్రశ్న ఆ ఒక్క విరామం మన జీవితాలను, మన సంబంధాలను, మన సమాజాన్ని మరింత నిజాయితీగా, మరింత సమతుల్యంగా చేయగలదు.



డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ,
9490754169

## అంబటి, పేర్ని నానిలపై అట్రాసిటీ కేసులు

అంబటి రాంబాబుపై ఒక కేసు నమోదైంది. అలాగే, తాడేపల్లి తెలుగు విద్యార్థి సంఘం అధ్యక్షుడు రాయపూడి కిరణ్ ఫిర్యాదుతో మరికొన్ని కేసులు నమోదు చేశారు. అంబటి రాంబాబు, పేర్ని నానితో పాటు లేళ్ల అప్పిరెడ్డి, పనుగంటి చైతన్య, వేమారెడ్డి తదితరులు నిందితుల జాబితాలో ఉన్నారు. వీరితో పాటు రైతులు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా కూడా వైసీపీ నేతలపై కేసులు నమోదు చేశారు. మరోవైపు, వైసీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైతులపై పోలీసులు కౌంటర్ కేసు నమోదు చేశారు. ఈ పరిణామాలతో తాడేపల్లి ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరుపక్షాల నుంచి అందిన ఫిర్యాదులపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

## పేదలకు ఉపాధి కల్పిస్తే ఓర్వలేరా జగన్?

ఉపాధి కల్పించబోతున్నామని పేర్కొన్నారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా ఎంతో మందికి ఉపాధి కల్పిస్తుంటే జగన్‌క్ బాధ ఎందుకని లోకేశ్ ప్రశ్నించారు. పేదలు బాగుపడితే చూడలేకపోతున్నారా? అని నిలదీశారు.

## బ్రాండ్ అంబాసిడర్ జగన్

కిరాతకాలు, అబద్ధాలు, వంచనకు ఆయన పేటెంట్ రైట్ తీసుకున్నారు. నిర్వాసితులకు రూ.900 కోట్లకు పైగా పరిహారం అందించాల్సి ఉండగా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. జిల్లా రైతులను, నిర్వాసితులను హౌస్ అరెస్టు చేసి, 144 సెక్షన్ పెట్టి, పరదాల చాటున వెలిగొండను జాతికి అంకితం చేశారు" అని మండిపడ్డారు. "ఐదేళ్ల గొడ్డలి పార్టీ పాలనలో రూ.792 కోట్లతో 20 శాతం పనులు చేశామని లెక్కల్లో చూపించారు. నేడు కూటమి ప్రభుత్వం 23 నెలల్లోనే రూ.759 కోట్ల పనులు పూర్తి చేసింది. టన్నెల్-2లో 12 కి.మీ దగ్గర చిక్కుకున్న టీబీఎం తొలగించకుండా చుక్క నీరు కూడా ఇవ్వలేమని తెలిసినా.. ఐదేళ్లలో ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం.. హైకోర్టు అనుమతితో టీబీఎం తొలగింపు పనులు చేపట్టింది. నల్లమలసాగర్ నిర్వాసితుల పునరావాసానికి అదనపు బడ్జెట్‌లో రూ.903 కోట్లు కేటాయించాం. ప్రస్తుత అంచనాల ప్రకారం వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కావాలంటే ఇంకా రూ.3844 కోట్లు అవసరం" అని మంత్రి నిమ్మల అన్నారు.

**జగన్ కుట్రలను ప్రజలు క్షమించరు : ఎంపీ కలిశెట్టి?**

రాష్ట్ర రాజధాని అమరావతిపై జగన్‌మోహన్ రెడ్డి మొదటి నుంచి చేస్తున్న కుట్రలు, విధ్వంసకర ఆలోచనలు మరోసారి బట్టబయలయ్యాయని తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ధ్వజమెత్తారు. జగన్ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవమైన అమరావతిని నాశనం చేయడానికి పన్నిన కుట్రలను రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరువరని స్పష్టం చేశారు. రాజాంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మళ్లీ విధ్వంసాన్ని, అల్లర్లను సృష్టించి తప్పుడు ప్రచారాలు చేయాలనే ఉద్దేశంతోనే జగన్ తన అనుచరులను అమరావతికి పంపి డ్రామాలు ఆడిస్తున్నారని మండిపడ్డారు. కేవలం 11 సీట్లకు పరిమితమైనా ఆయనకు బుద్ధి రాలేదని.. ఇప్పటికైనా స్వార్థ రాజకీయాలు, కుట్రలు మానుకోకపోతే భవిష్యత్తులో రాజకీయంగా పుట్టగతులు ఉండవని హెచ్చరించారు.

## అమెరికా వరదల్లో తెలుగు యువకుడు గల్లంతు

నివాసముంటున్నాడు. ఇటీవల భారీ వర్షాలు, వరదల కారణంగా కాన్సాస్ రాష్ట్రం వెల్లింగ్టన్ సమీపంలోని ఎస్.ఆలివర్ రోడ్ ప్రాంతంలో వెంకటేశ్ కొట్టుకుపోయాడు. యువకుడి ఆచూకీ ఇంకా లభ్యం లేదు. ఈ విషయాన్ని యువకుడి కుటుంబసభ్యుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే.. గాలింపు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు లేఖలు రాశారు. గల్లంతైన వెంకటేశ్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టేలా అమెరికా రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరపాలని రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఏలూరి సాంబశివరావు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని లోకేశ్‌కు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

## ప్రజలు శాశ్వతంగా బహిష్కరించారు

కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. నల్గొండలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం నాగార్జున కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు.

**బీఆర్ఎస్ హయాంలో పేదల ఇళ్ల గురించి ఆలోచించలేదు**

"గ్రామగ్రామాన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తుంటే బీఆర్ఎస్ వాళ్లకు కడుపు మండుతోంది. పదేళ్లపాటు ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు కానీ.. పేదల ఇళ్ల గురించి ఆలోచించలేదు. ఏటా రూ.16వేల కోట్లు ఖర్చు చేసి పేదలకు సన్నబియ్యం ఇస్తున్నాం. 30 నెలల్లోనే రైతుల ఖాతాల్లో రూ.1.56లక్షల కోట్లు జమ చేశాం. యూరియా సరఫరాలో కేంద్రం సహకరించకపోయినా కష్టపడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ ఇవాళ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నాం. 30 నెలల్లోనే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చి చరిత్ర సృష్టించాం. దేశంలో గతంలో ఎన్నడూ జరగని కులగణనను రాష్ట్రంలో చేపట్టాం. మా ఒత్తిడితోనే కేంద్రం కూడా జనగణనతో కులగణన చేస్తామని చెప్పింది.

**మంత్రి పదవిని త్యాగం చేసిన వ్యక్తి కోమటిరెడ్డి**

తెలంగాణ ఉద్యమ చరిత్ర తెలిసిన అందరికీ నల్గొండ చరిత్ర తెలుసు. తొలిదశ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ మంత్రి పదవిని త్యాగం చేశారు. మలిదశ ఉద్యమంలో మంత్రి పదవిని త్యాగం చేసిన వ్యక్తి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. నల్గొండ జిల్లా ప్రజలు గర్వించేలా ఆయన దీక్ష కూడా చేశారు. వందల మంది త్యాగాలు చేసి తెలంగాణ సాధిస్తే దాన్ని బీఆర్ఎస్ నేతలు వాళ్ల ఖాతాలో వేసుకున్నారు. పెట్రోల్ పోసుకుని అగ్గిపెట్టె తెచ్చుకోని వాళ్లు త్యాగాలు చేసినట్లు చెప్పుకొంటున్నారు. పెట్రోల్ పోసుకుని ప్రాణాలు అర్పించిన శ్రీకాంతాచారి త్యాగాన్ని ఏమనాలి?

**ఎవరు అడ్డువచ్చినా మూసీ ప్రక్షాళన ఆగదు**

మూసీ కాలుష్యం తమ పాలిట విషంగా మారిందని నల్గొండ జిల్లా ప్రజలు బాధపడుతున్నారు. మూసీ నదిని శుద్ధి చేసి ప్రజలకు మేలు చేస్తామంటే దాన్ని కూడా పలువురు నేతలు వ్యతిరేకిస్తున్నారు. ఎవరు అడ్డువచ్చినా మూసీ ప్రక్షాళన ఆగదు. ఫాంహౌస్‌లో మెషిన్లు పెట్టుకుని భార్యాభర్తల ఫోన్లు కూడా దొంగచాటుగా విన్నారు. నిజాలు మాట్లాడే అలవాటు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు ఏనాడూ లేదు. ఆ పాపాల భైరవుడు మళ్లీ అధికారంలోకి రావాలని ఇద్దరు నేతలు తిరుగుతున్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై చర్చ పెడతాం. దానికి సిద్ధమా? రూ.లక్ష కోట్లతో కేసీఆర్, హరీశ్‌రావు కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలి మూలన పడింది. వైఎస్ఆర్ చేపట్టిన ఎస్ఎల్‌బీసీని పదేళ్లపాటు కేసీఆర్ పట్టించుకోలేదు. వచ్చే ఎన్నికల్లోపు ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను పూర్తిచేస్తాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## తెలంగాణ ప్రజలకు భాజపాపై నమ్మకముంది

సహకారంతో భాగ్యనగరానికి విముక్తి కలిగింది. తెలంగాణ ఏర్పాటుకు భాజపా కూడా పోరాడింది. పార్లమెంట్‌లో సుష్మాస్వరాజ్ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం గళమెత్తారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా పెద్ద ఎత్తున అవినీతి జరిగింది. ఆ పార్టీపై వ్యతిరేకతతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదు. ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేస్తోంది. తెలంగాణ అభివృద్ధి డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే సాధ్యం. కాంగ్రెస్‌ది భారతీయ ఆలోచన కాదు.. ఇటలీ ఆలోచన. 2028లో తెలంగాణలో భాజపా ప్రభుత్వం ఏర్పడుతుంది. నరేంద్రమోదీ 12 ఏళ్ల పాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాలు, సాహసోపేతమైన నిర్ణయాలను క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లాలి. వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టి సమన్వయంతో పార్టీ అధికారంలోకి వచ్చేందుకు పనిచేయాలి" అని నితిన్ నబీన్ దిశానిర్దేశం చేశారు.

**రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం: రామచందర్‌రావు**

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ కలిసినా హైదరాబాద్ భాజపా అడ్డా అన్నారు. రానున్న ఎన్నికల్లో మూడు కార్పొరేషన్లనూ కైవసం చేసుకుంటామని చెప్పారు. నగరంలో చిన్నపాటి వర్షాలకే రోడ్లు నదులను తలపిస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని ఆరోపించారు. రోహింగ్యాలు, బంగ్లాదేశీయుల ఓట్లతో కార్పొరేషన్లు దక్కించుకోవాలని మజ్లిస్ కుట్ర పన్నుతోందన్నారు.

# ఎడిటర్ వాయిస్

## రాజకీయం ప్రజల కోసమా.. రాజకీయాల కోసమా?

ప్రజాస్వామ్యంలో రాజకీయం ఒక పవిత్రమైన వ్యవస్థ. ప్రజల సమస్యలకు పరిష్కారాలు చూపించడం, అభివృద్ధికి దారులు వేయడం, ప్రజా సంక్షేమాన్ని కాపాడడం రాజకీయాల అసలు లక్ష్యం. అయితే నేటి రాజకీయాల్లో ప్రజా సమస్యల కంటే రాజకీయ విమర్శలు, ఆరోపణలు, ప్రతిఆరోపణలకే ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోందనే అభిప్రాయం ప్రజల్లో పెరుగుతోంది.

ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇస్తారు. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత ఆ హామీల అమలుపై ప్రజలు సహజంగానే ప్రశ్నలు అడుగుతారు. అదే సమయంలో ప్రతిపక్షం ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం కూడా ప్రజాస్వామ్యంలో కీలక భాగం. అయితే విమర్శలు వాస్తవాల ఆధారంగా ఉండాలి; పాలకులు కూడా నిర్మాణాత్మక సూచనలను స్వీకరించే సంస్కృతి పెంపొందించాలి.

అభివృద్ధి అనేది ఒక్క పార్టీ సొత్తు కాదు. అధికార పక్షం, ప్రతిపక్షం, అధికారులు, ప్రజలు కలిసి పనిచేసినప్పుడే రాష్ట్రం, దేశం ముందుకు సాగుతుంది. రాజకీయ విభేదాలు సహజమే అయినప్పటికీ, ప్రజా ప్రయోజనాల విషయంలో ఐకమత్యం అవసరం.

నేడు ప్రజలు కేవలం మాటలను కాదు, ఫలితాలను కోరుకుంటున్నారు. మెరుగైన విద్య, నాణ్యమైన వైద్యం, ఉపాధి అవకాశాలు, రైతు సంక్షేమం, మౌలిక వసతులు, అవినీతి రహిత పరిపాలన వంటి అంశాలే ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తాయి. ఈ సమస్యల పరిష్కారమే నిజమైన రాజకీయ విజయానికి కొలమానం.

స్వతంత్ర మీడియా కూడా ఈ ప్రక్రియలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, ప్రభుత్వ నిర్ణయాలను విశ్లేషించడం, ప్రతిపక్ష అభిప్రాయాలను ప్రజలకు చేరవేయడం, వాస్తవాలను నిర్ధారించి అందించడం మీడియా బాధ్యత.

ప్రజాస్వామ్యంలో చివరి తీర్పు ప్రజలదే. అందుకే రాజకీయ నాయకులు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పనిచేయాలి. ప్రజలు కూడా వాస్తవాలు, పనితీరు, పారదర్శకత ఆధారంగా నాయకులను అంచనా వేయాలి. రాజకీయం వ్యక్తుల కోసం కాదు... ప్రజల కోసం. అధికారమే లక్ష్యం కాకూడదు; ప్రజా సేవే రాజకీయాల పరమావధి కావాలి.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## మోహన్‌నాయక్ కేసు దర్యాప్తులో ఆశ్చర్యకర అంశాలు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** అనిశా సోదాల్లో అత్యధికంగా ఆదాయానికి మించిన ఆస్తులతో చిక్కిన అధికారిగా రికార్డు సృష్టించిన ఆర్అండ్‌బీ ఈఎన్సీ(సస్పెండెడ్) మోహన్‌నాయక్ కేసు దర్యాప్తులో ఆశ్చర్యకరమైన కోణాలు వెలుగులోకి వచ్చాయి. రిజిస్ట్రేషన్ విలువ ప్రకారమే రూ.17.94 కోట్ల ఆస్తులతో చిక్కిన అతను... తాను అక్రమంగా సంపాదించిన ఆస్తుల్ని మరో ముగ్గురి పేరిట నమోదు చేయించినట్లు తాజాగా వెల్లడైంది. మోహన్‌నాయక్ బంధువులైన ఇద్దరు ప్రభుత్వోద్యోగుల పేరిట హైదరాబాద్‌లోని కీలక ప్రాంతంలో స్థిరాస్తులను రిజిస్టర్ చేయించినట్లు ఏసీబీ గుర్తించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఆ ఇద్దరు ప్రభుత్వోద్యోగులకు నోటీసులు ఇచ్చి విచారించారు. అవి మోహన్‌నాయక్‌కు సంబంధించిన స్థిరాస్తులే అని వారిద్దరూ వాంగ్మూలమిచ్చినట్లు సమాచారం. సరైన లెక్కలు చూపకపోతే వారిపైనా ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదయ్యే అవకాశముండటంతో సులభంగానే మోహన్‌నాయక్ బినామీ ఆస్తులుగా అంగీకరించినట్లు తెలిసింది.

**అధీనంలో మహిళ ఆస్తిపత్రం**

తమ కుటుంబంతో సంబంధం లేని మరో మహిళ పేరిట స్థిరాస్తి కొనుగోలుకు మోహన్‌నాయక్ డబ్బు సమకూర్చినట్లు ఏసీబీ దర్యాప్తులో వెల్లడైంది. ఆ మహిళ స్థిరాస్తి కొనేందుకు రూ.లక్షల్లో సొమ్ము చెల్లించిన మోహన్ నాయక్.. ఆ పత్రాన్ని మాత్రం తన వద్దే ఉంచుకున్నట్లు తేలింది. కాగా.. శనివారం నాటికి రెండు రోజుల కస్టడీ ముగియడంతో మోహన్ నాయక్‌ను ఏసీబీ అధికారులు తిరిగి న్యాయస్థానంలో హాజరు పరిచారు.

## అటవీ జంతువు వేట.. నిందితులను పట్టించిన గుట్కా ప్యాకెట్



**కాసిపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఓ గుట్కా ప్యాకెట్ అటవీ జంతువును వేటాడిన నిందితులను పట్టించిన ఘటన మంచిర్యాల జిల్లాలో చోటుచేసుకుంది. కాసిపేట మండలం దేవాపూర్ అటవీ రేంజ్ పరిధిలో సాంబార్ జింకను కొందరు వేటాడినట్లు రెండు రోజుల కిందట అటవీ అధికారులకు సమాచారం అందింది. దీంతో వారు హంటర్ డాగ్ స్క్వాడ్ సహాయంతో అటవీ ప్రాంతంలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అక్కడ నిందితుడు ఉపయోగించిన ఓ గుట్కా పొట్లం లభించింది. దాని ఆధారంగా పోలీసులు తనిఖీలు చేపట్టి.. గట్రావ్‌పల్లిలోని ఇప్పలగూడెంకు చెందిన ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి మంచిర్యాల కోర్టు ఎదుట హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు అధికారులు తెలిపారు.

## సహజీవనం చేసిన మహిళను హతమార్చి..

### కాలువలో పడేశాడు





**గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** బండరాయితో మహిళ తలపై మోది, చంపేసి.. మృతదేహాన్ని కాలువలో పడేసిన నిందితుడిని గుంటూరు జిల్లా దుగ్గిరాల పోలీసులు అరెస్టు చేశారు. గుంటూరులో శనివారం ఎస్పీ వకుల్ జిందాల్ ఈ వివరాలు వెల్లడించారు. బాపట్ల జిల్లా వేమూరు మండలం వెల్లబాడు గ్రామానికి చెందిన వల్లభాపురం చిరంజీవి మూడేళ్ల కిందట తిరుపతి జిల్లా రేణిగుంటలో ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేశాడు. ఆ సమయంలో అదే ప్రాంతానికి చెందిన మేనక (35) అతనికి పరిచయమైంది. ఇద్దరూ మూడేళ్లు సహజీవనం చేశారు. రెండు నెలల కిందట చిరంజీవి ఓ యువతిని వివాహం చేసుకున్నాడు. దీనిపై మేనక పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టింది. ఆమెకు మూడు విడతల్లో రూ.5 లక్షలు ఇచ్చేలా రాజీ కుదుర్చుకున్నాడు. తర్వాత చిరంజీవి రేణిగుంట నుంచి వెల్లబాడుకు మకాం మార్చాడు. మే 29న మేనక గుంటూరు వచ్చి చిరంజీవిని పిలవగా.. వెళ్లి కలిశాడు. ఆ సమయంలో చిరంజీవి వివాహం చేసుకున్న యువతి వివరాలు చెప్పాలని మేనక ఒత్తిడి చేసింది. అతను చెప్పకపోవడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తరువాత వారిద్దరూ ఆటోలో దుగ్గిరాలలోని పాతలాకులు వద్దకు చేరుకున్నారు. మళ్లీ మేనక వాగ్వాదానికి దిగడంతో చిరంజీవి.. ఆమె గొంతు నులిమి, బండరాయితో తలపై మోది హత్య చేశాడు. మృతదేహాన్ని పక్కనే ఉన్న కాలువలో పడేశాడు. జూన్ 8న పాతలాకులు వద్ద గుర్తుపట్టలేని స్థితిలో మృతదేహం బయటపడింది. పోలీసుల విచారణలో ఆ మృతదేహం మేనకదని తేలింది. దీనిపై చిరంజీవిని పోలీసులు విచారించగా, తానే ఆమెను హత్య చేశానని ఒప్పుకున్నాడని ఎస్పీ తెలిపారు.

## నీటి డ్రమ్ములో పడేసి.. చిన్నారి హత్య



**లింగాల, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇంటి పక్కనున్న వారితో తలెత్తిన తగాదాలు అభం శుభం తెలియని చిన్నారి హత్యకు కారణమయ్యాయి. వైఎస్సార్ కడప జిల్లా లింగాల మండలం లోపట్నూతల గ్రామంలో ఈ నెల 25న చిన్నారి నిత్విక (4) నీటి డ్రమ్ములో విగతజీవిగా కనిపించింది. చిన్నారి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. దీనిపై శనివారం పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ వివరాలు వెల్లడించారు. రామాచారి, సృజనశ్రీ దంపతుల కుమార్తె నిత్విక. వీరి ఇంటి పక్కన ఉంటున్న స్వాతితో సృజనశ్రీ స్నేహంగా ఉండేవారు. గతేడాది ఆగస్టులో వీరిద్దరి మధ్య పిల్లల విషయంలో గొడవలు చోటుచేసుకున్నాయి. అవి కాస్తా.. పెద్దవిగా మారి రామాచారికి చెందిన రెండు ద్విచక్ర వాహనాలను దహనం చేసే వరకు వెళ్లింది. అప్పటి నుంచి వీరు తరచూ దూషించుకునేవారు. ఈ క్రమంలో నిత్విక ఈ నెల 25న సాయంత్రం ఆడుకుంటూ బయటికి వెళ్లింది. గమనించిన స్వాతి.. చిన్నారిని సమీపంలోని ఓ ఇంటి ఆవరణలోకి తీసుకెళ్లింది. అక్కడున్న నీటి డ్రమ్ములో వేసి, ఊపిరి ఆడకుండా చేసి.. బాలికను హత్య చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

## బాంబుతో ప్రియురాలికి బెదిరింపులు

### సజీవదహనమైన ప్రియుడు



**బెంగళూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కారులో వెళ్తూ పెట్రోల్ బాంబుతో ప్రియురాలిని బెదిరించాలని చూసిన ప్రియుడు చివరికి తన ప్రాణాలనే కోల్పోయాడు. ఆమె చాకచక్యంగా కిందకు దూకేసి బతికిపోగా.. అతను సజీవదహనమయ్యాడు. బెంగళూరు జయనగరలో ఉంటున్న ఓ యువతి స్థానిక సంజయ్ గాంధీ ఆసుపత్రిలో ఓటీ టెక్నీషియన్‌గా పనిచేస్తోంది. ఆరేళ్లుగా నాగేంద్ర(30), ఆమె మధ్య స్నేహం, ప్రేమ కొనసాగాయి. కొద్ది రోజులుగా అతని సెల్‌ఫోన్ నంబర్‌ను ఆమె బ్లాక్ చేసి దూరంగా ఉంటోంది. దీంతో శనివారం వేకువజామున నాగేంద్ర కారు అద్దెకు తీసుకొని యువతి గదికి వచ్చాడు. తనతో అంకోలాకు రావాలని గొడవ చేశాడు. ఇద్దరూ కలిసి ఉదయం ఏడు గంటలకు బెంగళూరు నుంచి బయలుదేరారు. తుమకూరు దాటిన తర్వాత తనను వివాహం చేసుకోవాలని, లేకపోతే హత్య చేస్తానని పెట్రోల్ బాంబు తీసి బెదిరించాడు. ఆమె అందుకు అంగీకరించకపోవడంతో తల, చేతులపై కత్తితో దాడి చేశాడు. అప్పటికి కారు శిరా సమీపంలోని జోగిహళ్లి ప్రాంతానికి చేరుకుంది. నెమ్మదిగా వెళ్తున్న కారు తలుపు తీసుకుని యువతి చాకచక్యంగా కిందకు దూకింది. అనంతరం క్షణాల వ్యవధిలో పెట్రోల్ బాంబు పేలి కారుతో సహా నాగేంద్ర మంటల్లో కాలిపోయాడు. ప్రియురాలు దూకుతున్నట్లు గమనించి.. ఆమెను చంపాలనే ఉద్దేశంతో పెట్రోలు బాంబు పేల్చేశాడా, లేక ప్రమాదవశాత్తు పేలిందా అన్న కోణంలో కళ్లంబెళ్ల ఠాణా పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## దళిత యువకుల మృతిపై దర్యాప్తు



**బ్రహ్మంగారి మఠం, విశ్వం వాయిస్ న్యూస్ :** బ్రహ్మంగారిమఠం దళిత యువకుల మృతిపై మైదుకూరు డిఎస్పి మీడియా సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి నెల 5వ తారీఖు ఇద్దరు యువకులు కాలువలో పడి మృతి చెందడం జరిగింది. ఈ విషయంలో దళిత సంఘాలు పలు అనుమానాలను వ్యక్తం చేశాయి. యువకుల మృతి పై న్యాయం జరగలేదనీ దళిత సంఘాల ఆధ్వర్యంలో చలో కడప కార్యక్రమం చేపట్టినట్లు మా దృష్టికి వచ్చింది. దళిత సంఘాలు మృతిపై పలు డిమాండ్లు వ్యక్తం చేశారు. డిమాండ్లలో భాగంగా ఈ కేసును ఐపీఎస్ అధికారితో దర్యాప్తు చేయాలని కోరారు. వారి విజ్ఞప్తి మీదకు కడప ఎస్పీ నచికేత్ విశ్వనాత్ ప్రొద్దుటూరు ఏఎస్పీ విభూ కృష్ణ ఐపీఎస్‌ని విచారణ అధికారిగా నియమించారు. ఎఫ్ఐఆర్ నమోదులో ఎస్సై చట్టపరంగా చేయలేదన్న అనుమానం వ్యక్తం చేశారు. బ్రహ్మంగారిమఠం ఎస్ఐ మీద కేసుకు సంబంధించి సమగ్ర విచారణ జరిపేందుకు డిఎస్పీ మైదుకూరు వారికీ మేము జారీ చేయడం జరిగింది దానిపై విచారణ జరిపి నివేదిక పంపాలి అని ఎస్పీ కోరడం జరిగింది. మృతులతో సహా వెళ్లిన సాక్షి వీడియోను ఎఫ్ఎస్ఎల్ పంపడం జరిగింది. దాని త్వరితగతిన వచ్చేలా స్పెషల్ మెసెంజర్ ను ఏర్పాటు చేసి తెప్పించడానికి ప్రయత్నాలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా దళిత సంఘాలు చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని విరమించుకోవాల్సిందిగా పోలీసు శాఖ తరపున విజ్ఞప్తి చేస్తున్నాం.

# కులాల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు మానుకోవాలి

**రౌడీషీట్లను కులానికి ఆపాదించడం సరికాదు - శెట్టిబలిజల అభ్యున్నతే లక్ష్యంగా కార్పొరేషన్ నిరంతరం పనిచేస్తోంది**

**చట్టం తన పని తాను చేస్తుంది - చైర్మన్ కుడుపూడి సత్తిబాబు హెచ్చరిక**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రౌడీషీట్లకు కులాన్ని ముడిపెట్టి మొత్తం సమాజాన్ని అపవాదుకు గురిచేయడం బాధ్యతారాహిత్యమని, కులాల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు మానుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు మీడియా సమావేశంలో హెచ్చరించారు.ఆదివారం ఉదయం జాతీయ రహదారిని ఆనుకుని డెల్టా ఆసుపత్రి పక్కన ఉన్న ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన నాటి నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా శెట్టిబలిజ సంక్షేమం, అభివృద్ధి, ఆత్మ గౌరవ పరిరక్షణ కోసం అనేక కార్యక్రమాలు అమలు చేశామన్నారు. గత ఏడాదిన్నర కాలంలో కార్పొరేషన్ ద్వారా ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. శెట్టిబలిజల జీవనోపాధిని బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. మద్యం దుకాణాల కేటాయింపుల్లో రిజర్వేషన్ కల్పించడం, రాష్ట్రంలో ఖాళీ అయిన బార్ లైసెన్సుల్లో తమ వర్గానికి అవకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. శెట్టిబలిజ, గౌడ తదితర ఐదు అనుబంధ కులాలు ఐక్యంగా ఉండాలన్నదే తమ లక్ష్యమని, కొందరు వ్యక్తిగత ప్రయోజనాల కోసం కులాల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. అలాంటి ప్రయత్నాలకు ఎవరూ ప్రోత్సాహం ఇవ్వవద్దని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో బీసీల గొప్ప నాయకుడు గౌతు లచ్చన్న విగ్రహాన్ని తొలగించినప్పుడు వైసీపీ నాయకుల్లో ఒక్కరూ స్పందించలేదని విమర్శించారు. ఆ సమయంలో బీసీలకు చెందిన ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఎవరూ ముందుకు రాలేదన్నారు. గౌతు లచ్చన్న కుటుంబానికి తాము అండగా నిలిచామని గుర్తుచేశారు. శెట్టిబలిజ సమాజానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో మహోన్నత సేవలందించిన దొమ్మేటి వెంకటరెడ్డి సేవలను ప్రభుత్వం అధికారికంగా గుర్తించేలా కృషి చేశామని తెలిపారు. ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించేలా ప్రభుత్వం జీవో జారీ చేయడం, విశాఖపట్నంలో అధికారిక వేడుకలు నిర్వహించడం, రాజమహేంద్రవరంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం కార్పొరేషన్ సాధించిన విజయాలని పేర్కొన్నారు. లాలాచెరువు సెంటర్‌లో తన సొంత ఖర్చుతో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలో అదే ప్రాంతంలో గౌతు లచ్చన్న విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ ఇద్దరు మహనీయులు ఐదు బీసీ కులాల ఐక్యతకు ప్రతీకలని అన్నారు. శెట్టిబలిజల కోసం ప్రత్యేక కళ్యాణ మండపం నిర్మాణానికి రెండు ఎకరాల స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. త్వరలోనే దీనిపై శంకుస్థాపన జరిగేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రౌడీషీట్ల అంశాన్ని కులానికి ఆపాదించడం పూర్తిగా తప్పని స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించే వారు ఎవరైనా వారిపై పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని, రౌడీషీట్లు కులాలను చూసి కాకుండా నేరచరిత్రను బట్టి మాత్రమే నమోదు చేస్తారని చెప్పారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం చట్టం కఠినంగా అమలవ్వాలని అభిప్రాయపడ్డారు. శెట్టిబలిజ జీవనోపాధి మెరుగుపర్చేందుకు తాటి కార్మికులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. ఆదరణ పథకం కింద పనిముట్ల కొనుగోలుకు రూ.15 వేల ఆర్థిక సాయం, తక్కువ వాటాతో వాహనాల పంపిణీ వంటి అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. తాటి ఉత్పత్తుల విలువ ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి 'నీరా' ప్రాజెక్టును ప్రారంభిస్తున్నామని తెలిపారు. తొలి విడతలో రంపచోడవరం ప్రాంతంలో 50 మంది యువతకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, రెండు యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఒక్కో యూనిట్ ద్వారా సుమారు రూ.3 కోట్ల వరకు ఆర్థిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉందని, గ్రామీణ యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్నారు. తెలుగుదేశం పార్టీ యువతకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చే పార్టీ అని పేర్కొంటూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారని అన్నారు. ఆ విశ్వాసానికి తగ్గట్టుగా సమాజ సేవ చేస్తానని చెప్పారు. రాబోయే రోజుల్లో శెట్టిబలిజలకు మరిన్ని కీలక పదవులు, సంక్షేమ కార్యక్రమాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. కులాల మధ్య విభేదాలు కాకుండా ఐక్యతే అభివృద్ధికి మార్గమని, సెట్టిబలిజలంతా ఒక్కటిగా ఉండి కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో చింతపల్లి నాని, చెల్లుబోయిన సూర్యనారాయణ మూర్తి, సాయి గణేష్, పిల్లి శ్రీను, మహేష్,గణేష్ తదితర శెట్టిబలిజ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెలుగులోకి వస్తున్న ప్రతిభ

**వినూత్న ఆలోచనలకు లభించిన గుర్తింపు**

**టెక్ విజనరీ అండ్ సోషల్ ఇంపాక్ట్ లీడర్ అవార్డు అందుకున్న రామ్‌కుమార్ రామదేవు**

**అవార్డు పొందడం ఆనందంగా ఉంది**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ పార్లమెంట్ సభ్యురాలు,పద్మశ్రీ జయప్రద చేతుల మీదుగా నిర్వహించిన ప్రైడ్ ఆఫ్ సౌత్ ఇండియా అవార్డ్స్-2026 కార్యక్రమంలో "టెక్ విజనరీ అండ్ సోషల్ ఇంపాక్ట్ లీడర్" అవార్డును అందుకోవడం ఎంతో గౌరవంగా, ఆనందంగా ఉందని రామ్‌కుమార్ రామదేవు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరాన్ని పైలట్ మోడల్‌గా తీసుకుని టియర్-3 నగరాల్లో స్థిరమైన స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను నిర్మించాలనే తన ప్రయత్నాలకు, అలాగే ఇన్నోవేషన్, టెక్నాలజీ, విద్య ద్వారా యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే తన ప్రయాణానికి ఈ అవార్డు గొప్ప ప్రోత్సాహంగా నిలిచిందన్నారు. ఈ ప్రయాణంలో తనను నమ్మి, ప్రోత్సహించి, ప్రతి అడుగులోనూ అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు తన వ్యక్తిగత విజయమే కాకుండా, చిన్న నగరాల నుంచి వెలుగులోకి వస్తున్న ప్రతిభకు, వినూత్న ఆలోచనలకు లభించిన గుర్తింపుగా భావిస్తున్నట్లు రామ్‌కుమార్ రామదేవు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.




# అనుమతి పత్రం కాదు... కేవలం దరఖాస్తు మాత్రమే!

- 'సూర్యా కన్‌స్ట్రక్షన్స్' ఘోర వంచన.. చేతులెత్తేసిన యాజమాన్యం!.
- దొరికితే దొంగలు.. దొరకకపోతే దొరలు చందంగా అక్రమ గ్రావెల్ తవ్వకాలు!
- చెందుర్తి పుష్కర కాలువ వద్ద గుట్టురట్టు చేసిన గ్రామస్తులు, అధికారులు
- జేసీబీ, 4 లారీలు సీజ్.. రూ. 1.40 లక్షల జరిమానా విధింపు!

**గొల్లప్రోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** "దొరికితే దొంగలు... దొరకకపోతే దొరలు" అన్న చందంగా తయారైంది కొన్ని అక్రమ మట్టి తవ్వకాల యాజమాన్యాల వ్యవహారం. దవళేశ్వరం పట్టణానికి చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ 'సూర్యా కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్' సాగిస్తున్న నిలువు దోపిడీ, అక్రమ దందా తాజాగా రచ్చకెక్కింది. మట్టి తవ్వుకోవడానికి ప్రభుత్వానికి పెట్టుకున్న కేవలం ఒక 'దరఖాస్తు' (అప్లికేషన్) కాగితాన్ని చూపిస్తూ.. దాన్నే అధికారిక 'అనుమతి పత్రం'గా నమ్మించి పగలు, రాత్రీ తేడా లేకుండా యథేచ్ఛగా సాగిస్తున్న దోపిడీ బట్టబయలైంది.

**కాలువ తీరాన కాటేస్తున్న మాఫియా!**

గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామంలో పుష్కర కాలువను ఆనుకుని ఉన్న కెనాల్ పరివాహక ప్రాంతంలో గత కొన్ని రోజులుగా సూర్యా కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా భారీ ఎత్తున తవ్వకాలు చేపట్టింది. జేసీబీలతో భూమిని తవ్వేస్తూ, ట్రాక్టర్లు, లారీల ద్వారా విలువైన గ్రావెల్‌ను తరలిస్తోంది. కాలువ పక్కనే ఇంత పెద్ద ఎత్తున తవ్వకాలు జరుగుతుండటంతో స్థానిక రైతులు, గ్రామస్తులు ఆందోళనకు గురై సదరు కంపెనీ ప్రతినిధులను నిలదీశారు.

**ట్విస్ట్ ఇక్కడే.. దరఖాస్తే పర్మిషన్ పత్రమా?!**

గ్రామస్తులు గట్టిగా ప్రశ్నించేసరికి.. సూర్యా కన్‌స్ట్రక్షన్స్ సిబ్బంది తాము అనుమతి తెచ్చుకున్నామంటూ కొన్ని కాగితాలు చూపించారు. అయితే, ఆ పత్రాలను జాగ్రత్తగా పరిశీలించిన రైతులకు మైండ్ బ్లాంక్ అయింది. అది మైనింగ్ శాఖ ఇచ్చిన అనుమతి పత్రం కాదు.. తాము తవ్వుకుంటాం సార్ అంటూ ఆ కంపెనీ పెట్టుకున్న ఉత్తుత్తి 'దరఖాస్తు నకలు' మాత్రమే! కంపెనీ చేస్తున్న ఈ పక్కా మోసాన్ని గుర్తించిన గ్రామస్తులు తక్షణమే గొల్లప్రోలు తాహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

**రంగంలోకి రెవెన్యూ.. సీజ్, కేసు నమోదు!**

బాధిత రైతుల ఫిర్యాదుతో తక్షణమే స్పందించిన గొల్లప్రోలు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో కలిసి గ్రావెల్ తవ్వుతున్న ప్రదేశంపై మెరుపు దాడి చేశారు. క్షేత్రస్థాయిలో అనుమతి పత్రాలను పరిశీలించగా.. సూర్యా కన్‌స్ట్రక్షన్స్‌కు అసలు ఎలాంటి అధికారిక అనుమతులూ లేవని తేలిపోయింది. దీంతో రెవెన్యూ అధికారులు తవ్వకాలకు ఉపయోగిస్తున్న ఒక జేసీబీతో పాటు, గ్రావెల్ తరలిస్తున్న 4 లారీలను అక్కడికక్కడే సీజ్ చేశారు. అనంతరం స్థానిక పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేయడంతో పాటు, మైనింగ్ శాఖ ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు.

**రూ. 1.40 లక్షల జరిమానా.. జిల్లా వ్యాప్తంగా విచారణ!**

రెవెన్యూ అధికారుల నివేదికపై జిల్లా మైన్స్ అధికారి జగన్నాధరావు తక్షణమే స్పందించారు. నిబంధనలను బేఖాతరు చేస్తూ, నకిలీ పత్రాలతో అనధికారికంగా తవ్వకాలు జరిపిన సూర్యా కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి శనివారం లిరూ. 1.40 లక్షల అపరాధ రుసుము (పెనాల్టీ)లి విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అంతేకాదు, సదరు సూర్యా కంపెనీ జిల్లాలో ఇంకా ఎక్కడెక్కడ ఇలాంటి తప్పుడు పత్రాలు, దరఖాస్తులను చూపించి అక్రమ తవ్వకాలకు పాల్పడుతోందో పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని, బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని మైనింగ్ అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వ సంపదను కొల్లగొడుతూ, నమ్మించి మోసం చేయాలని చూసిన సూర్యా కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారం ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా సంచలనంగా మారింది.

ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్న

# "ఓం శివశక్తి పీఠం - శంభాల నగరం" : బత్తుల

**మహా కుంభాభిషేకానికి భారీ ఏర్పాట్లు**

**గాదరాడలో కదం తొక్కిన కళామ తల్లులు**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని గాదరాడలో శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఆధ్యాత్మిక దివ్యధామం "ఓం శివశక్తి పీఠం – శంభాల నగరం"లో నాలుగో రోజు నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన 36 దివ్య ఆలయాల విగ్రహ ప్రతిష్ఠాపన పర్వాలు, వేద పండితుల మంత్రోచ్చారణలు, హోమ గుండలు గణపతిపూజ అనంతరం పుణ్యాహవచనం, యాజమాన సంకల్పం, సోమకుంబపూజ, సూర్యపూజ, మండప పూజ,వేదికార్చన, సమస్త దేవత ఆవాహన పూజ, సమస్త దేవత హోమం, నవాగ్ని యాగపూజ,మూలమంత్ర హోమం, విశేష ఔషధ ద్రవ్య హోమం, పూర్ణాహుతి, దీపారాధన, సమస్త దేవత అష్టబంధన సమర్పణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు కూచిపూడి, భరతనాట్యం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సోమవారం వైభవంగా జరగనున్న "మహా కుంభాభిషేకం" యావన్మంది తిలకించి, స్వామి అనుగ్రహం పొందాలని బత్తుల దంపతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు బత్తుల దంపతులు, కుటుంబసభ్యులు, సుదీర్ఘ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

అంగవైకల్యాన్ని నిర్మూలిద్దాం..

# పల్స్ పోలియో చుక్కలు వేయిద్దాం..




**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదివారం గోకవరం మండలం లోని నిర్దేసించిన అన్ని బూత్ లలో పల్స్ పోలియో కార్యక్రమం ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మండలంలోని అన్నిగ్రామాలలో 6,392 మంది 5 సం. లోపు పిల్లలకు 40 బూత్స్ ఏర్పాటు చేసారని 2 మొబైల్ వాహనాలు ట్రాన్సిట్ 3 సెంటర్స్ లోను వైద్య సిబ్బంది 170 మంది ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద పల్స్ పోలియో కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గజింగం సత్తిబాబు, చంటి పిల్లలకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అందరూ తమ 0 నుండి 5 సం. లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని ఈ కార్యక్రమం మొదటి రోజు బూత్ లో చుక్కలు వేస్తారని రెండవరోజు మూడవ రోజు ఇంటింటికీ తిరిగి మార్కింగ్ వేసి మిగిలిన పిల్లలకు వేస్తారని ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకొని పిల్లలలో అంగవైకల్యం నకు గురి కాకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రమణ, వైద్య సిబ్బంది పవన్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీం మరణం పార్టీకి తీరని లోటు




**సంస్మరణ సభలో ఎమ్మెల్యే వేగుళ్ళ**

**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎంత ఎదిగినా ఒదిగి ఉండే వ్యక్తులలో ఇబ్రహీం ఒకరని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట విజయలక్ష్మి నగర్ లో ఉన్న ఎపిజె అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్‌లో ఆదివారం నిర్వహించిన దివంగత హాజీ షేక్ ఇబ్రహీం సంస్మరణ సభలో ఎమ్మెల్యే వేగుళ్ళ పాల్గొన్నారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ ఇబ్రహీం మరణం పార్టీకి తీరని లోటన్నారు. పార్టీ నిర్వహించే ప్రతీ కార్యక్రమంలోను ఆయన చురుకుగా పాల్గొనేవారన్నారు. ఆయన ఏ కార్యక్రమం కు వచ్చిన టోపి ధరించే వచ్చేవారన్నారు. మాజీ కోప్షన్ సభ్యులు గా, అమలాపురం పార్లమెంట్ టీడీపీ మైనారిటీ కమిటీ ఉపాధ్యక్షులు గా, అనేక కార్మిక సంఘాలకు అధ్యక్షులు గా పనిచేశారన్నారు. ప్రస్తుతం ఎపిజె అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ గా పనిచేస్తున్నారన్నారు. ఇటువంటి మంచి వ్యక్తి మన మధ్య లేకపోవటం భాదకరం అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ఆ అల్లాహ్ మనోధైర్యం ప్రసాదించాలన్నారు. ఇబ్రహీం పవిత్ర ఆత్మకు శాంతి కలుగచేయాలని ప్రార్ధించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వి.సాయికుమార్ బాబు, వేగుళ్ళ అజయ్ కుమార్, టీడీపీ నూర్ భాష సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ షేక్ సుభాన్, షేక్ మౌలానా, రాష్ట్ర టిడిపి మైనార్టీ సెల్ కార్యదర్శి సల్మాన్ హుస్సేన్, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎండి అతవుర్ రెహమాన్ ఆల్తాఫ్,సయ్యద్ రబ్బానీ,అల్ అమీన్ మస్జిద్ ప్రెసిడెంట్ ఎండి రహీం, మౌలాలి,ఎండీ కరీం ఖాద్రి,పట్టణ టీడీపీ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ కరీం, సిఐటియూ నాయకులు కే.కృష్ణ వేణి, మెండు బాపిరాజు వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

# పోలియో నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం కావాలి

**పోలియో చుక్కలకు ప్రాధాన్యత ఇవ్వాలి – తల్లిదండ్రులకు వైద్యుల సూచన**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలియో నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం కావాలి డాక్టర్ శిరీష్ అన్నారు.తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం స్థానిక నారాయణపురం యుపిహెచ్సి హాస్పిటల్లో (అద్దేపల్లి కాలని )పల్స్ పోలియో కార్యక్రమంను వైద్యులు, అధికారులు నిర్వహించారు.డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్న పిలుపుతో చిన్నారులతో తల్లిదండ్రులు తరలివచ్చి పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష మాట్లాడుతూ,పోలియో నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని, ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమాలకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని శిరీష అన్నారు.పిల్లల తల్లి దండ్రులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బందితో పాటు కూటమి నేతలు కోసూరి చండీప్రియ,రాయుడు గణేష్, కాశి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి ఇద్దరు యువకులు మృతి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం ముని కూడలి దగ్గర రాజంపేట గ్రామం ఇసుక ర్యాంపు దగ్గర స్నానానికి వెళ్లి శ్రీ మహతి స్కూల్లో 9వ తరగతి చదువుతున్న తొర్రేడు గ్రామానికి చెందిన అల్లూరి మహి 14 సంవత్సరాలు, వెదుళ్ళపల్లి హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న రాజంపేట గ్రామానికి చెందిన పసుపులేటి దుర్గాప్రసాద్ 15 సంవత్సరాలు ప్రమాదవశాత్తు మృతి చెందారు.ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాలను వెలికి తీసి కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పసలపూడి రాఘవ పుట్టినరోజు సందర్భంగా

# పేదవారికి ఆకలి తీర్చిన కుటుంబం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేవోక్తి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పల్లంట్ల గ్రామానికి చెందిన స్వర్గీయ పసలపూడి రాఘవ పుట్టినరోజు సందర్భముగా పేదవారికి అన్నదాన కార్యక్రమం కొవ్వూరు గోష్పాద క్షేత్రం, రాజమండ్రి పుష్కర్ ఘాట్ వద్ద ఉన్న పేదవారికి భోజనాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమం లో వారి కుటుంబ సభ్యులు, చిడిపి గ్రామం మెరిపే వారి బంధు మిత్రులు, దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ టీమ్ సభ్యులు ప్రత్తిపాటి నాగరాజు పాల్గొన్నారు.

# నీట మునిగిన ప్రధాన రహదారి



**ప్రమాదాలకు నిలయంగా మారిన తంటికొండ రోడ్డు**

**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలం, తంటికొండ: ప్రసిద్ధిగాంచిన శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంకు వెళ్లే ప్రధాన రహదారి వర్షపు నీటిలో మునిగిపోవడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై భారీ గొయ్యి ఏర్పడినప్పటికీ అది పూర్తిగా నీటిలో కప్పుకుపోవడంతో ప్రమాదాలకు కారణమవుతోంది. దేవస్థానానికి నిత్యం భక్తులు, గ్రామస్థులు ఈ మార్గాన్ని వినియోగిస్తుంటారు. అయితే రహదారిలోని గోతి నీటిలో కనిపించకుండా ఉండటంతో ద్విచక్ర వాహనదారులు, ఆటో, కార్ల డ్రైవర్లు ప్రమాదవశాత్తు అందులో పడుతూ గాయాల పాలవుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో రహదారి మలుపు ఉండటంతో రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. ఎదురుగా వచ్చే వాహనాల లైట్ల కారణంగా గోతి కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని వాహనదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై ఏర్పడిన గోతిని వెంటనే పూడ్చి, వర్షపు నీరు నిల్వ కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని గ్రామస్థులు, భక్తులు, వాహనదారులు కోరుతున్నారు. పెద్ద ప్రమాదం సంభవించేలోపు అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

**అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కాశీ శివ నాగ మల్లేశ్వరరావు**



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు సంక్షేమం కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తుందని మండపేట అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కాశీ శివ నాగ మల్లేశ్వరరావు పేర్కొన్నారు.బాబు జగ్జీవన్ రామ్ భవన నిర్మాణ ,పెయింటింగ్ కార్మికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్మిక సంక్షేమ పథకాల అవగాహన సదస్స ఘనంగా జరిగింది.మండపేట పట్టణం 7 వ వార్డులోని శ్రీబాపూజీ స్కూల్ గ్రౌండ్ లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండపేట అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కాశీ శివ నాగ మల్లేశ్వరరావు కార్మికులతో కలసి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహానేత బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గూర్చి వివరించారు. ప్రభుత్వం కార్మికుడు కుమార్తెకు వివాహం నిమిత్తం రూ 20 వేలు అందిస్తుందన్నారు.కార్మికుని కుమార్తె , భార్య డెలివరీ అయితే రూ 20 వేలు అందచేస్తుందన్నారు.కార్మికుడు సహజంగా మరణిస్తే రూ 60 వేలు అందిస్తుందని చెప్పారు.అంత్య క్రియలకు రూ 20 వేలు అందిస్తుందన్నారు.ఈ సంక్షేమ పథకాలు అందాలంటే ప్రతీ ఒక్కరు తమ పేరు కార్మిక శాఖలో నమోదు చేయించుకోవాలని కోరారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి రెవిన్యూల్ చేయించుకోవాలని తెలియజేసారు. ప్రమాద బీమా, వైద్య సహాయం, పిల్లల విద్యా ప్రోత్సాహకాలు తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. అనంతరం కార్మికులు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు చేరాలని ఎంతగానో కృషి చేస్తున్న లేబర్ ఆఫీసర్ కాశి శివ నాగ మల్లేశ్వరరావును ఘనంగా సత్కరించారు. 2008లో స్థాపించిన ఈ సంఘానికి 17 సంవత్సరాలుగా అండగా ఉంటూ, కొంతమందికి ఉపాధి కల్పిస్తున్న పెయింటింగ్ మేస్త్రీలకు,కార్యవర్గలకు అభినందన జ్ఞాపికలను అందచేసారు.ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు, పెయింటింగ్ మేస్త్రీలు, పెయింటింగ్ కార్మికులు పాల్గొన్నారు.




# చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలియో రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా కాకినాడ రూరల్ మండల పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. దేశ భవిష్యత్తుకు పునాదులైన చిన్నారులను పోలియో మహమ్మారి బారి నుంచి రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కాకినాడ రూరల్ టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని ఇంద్రపాలెం, స్వామినగర్, చీడిగ, కొవ్వాడ, రేపూరు, గంగనాపల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో ఉన్న చిన్నారులకు ఆయన స్వయంగా పోలియో చుక్కలు వేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో శారీరక వైకల్యానికి కారణమవుతున్న పోలియో లాంటి ప్రమాదకర వ్యాధులను వేళ్లూనుకోకుండా తరిమికొట్టేందుకు ప్రభుత్వం, ఆరోగ్య శాఖ సంయుక్తంగా చేపడుతున్న ఇటువంటి బృహత్తర కార్యక్రమాలు ఎంతో కీలకమైనవని కొనియాడారు. ఐదేళ్ల లోపు వయసున్న ప్రతి ఒక్క చిన్నారికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆయన తల్లిదండ్రులకు ఈ సందర్భంగా హితవు పలికారు. నిర్లక్ష్యం వీడి బాధ్యతగా పిల్లలకు ఈ చుక్కల మందును వేయించడం ద్వారానే ఆరోగ్యకరమైన, దృఢమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని నులుకుర్తి వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వంద శాతం పోలియో నిర్మూలన లక్ష్యంగా వైద్య సిబ్బంది ప్రాధాన్యత గుర్తించి పని చేయాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఎంతో అంకితభావంతో మారుమూల ప్రాంతాల్లో సైతం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండా వినాయక్, యలమంచిలి భాస్కర్, కుడిపూడి వీరబాబు, ఎలగా లోవరాజు, ఎల్ శ్రీనులతో పాటు వైద్య రంగ సేవలందిస్తున్న ఏఎన్ఎంలు జి.అమల, సుకృత, డి.విజయభద్రం, జే.అనిత, అలాగే ఎంఎల్ హెచ్ పీలు ఏ.హెఫ్సిబా, బి.మానస తదితర ఆరోగ్య శాఖ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నూనె బజ్జీలు తినడం వల్లనే ఫుడ్ పాయిజన్

### ప్రాథమిక దర్యాప్తులో వెల్లడి

**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా, కాజులూరు మండలం, దుగ్గుదూరు గ్రామంలో నమోదైన డయేరియా కేసులు పూర్తిగా అదుపులో ఉన్నాయని, ప్రజలు ఎటువంటి ఆందోళన చెంద వద్దని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ జె నరసింహ నాయక్ ఆదివారం తెలిపారు. శనివారం దుగ్గుదూరు గ్రామంలో స్థానిక వీధి వ్యాపారి వద్ద విక్రయించిన నూనె బజ్జీలు, పునుగులు తినడం వల్ల ఈ ఫుడ్ పాయిజనింగ్ జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని మొత్తం 32 మంది కడుపు నొప్పి, జ్వరం, విరేచనాల వంటి లక్షణాలకు లోనైయ్యారని ఆయన తెలిపారు. 32 మంది బాధితులకు తగిన వైద్య చికిత్స అందించామని, వీరిలో 23 మంది దుగ్గుదూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (గ్రాజ)లో ఇన్‌పేషెంట్లుగా చేరగా, 9 మందికి అవుట్ పేషెంట్లుగా చికిత్సపొందారని తెలిపారు. ప్రస్తుతం రోగులందరి ఆరోగ్యం, నిలకడగా ఉందని, ఎవరికీ ప్రాణాపాయం లేదని, పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని డియంహెచ్‌ఓ తెలియజేసారు. సమాచారం అందిన వెంటనే వైద్య బృందాలు గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించాయని, ప్రత్యేక బృందాలతో గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించామని తెలియజేసారు. అలాగే పిహెచ్‌సిలో 24/7 వైద్య సేవలు అందుబాటులో ఉంచామని తెలిపారు. గ్రామ ప్రజలకు సురక్షిత మంచినీటి వినియోగంపై అవగాహన కల్పించడంతో పాటు, గ్రామ పంచాయతీ ద్వారా పారిశుధ్య పనులు ముమ్మరంగా నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఫుడ్ ఇన్స్పెక్టర్ ఆహార నమూనాలను సేకరించారని, తాగునీటి భద్రత కోసం గ్రామీణ నీటి సరఫరా అధికారులు అప్రమత్తమై అవసరమైన చర్యలు చేపట్టారని తెలియజేశారు. వివిధ శాఖల సమన్వయంతో ప్రజారోగ్యాన్ని జిల్లా యంత్రాంగం నిశితంగా పర్యవేక్షిస్తోందని, పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని ప్రజలు ఎటువంటి భయాందోళనలు చెందవద్దని డిఎంహెచ్‌ఓ డా.నరసింహా నాయక్ తెలియజేశారు.

# పోలియో రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత




**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండపేట పట్టణంలోని 3వ వార్డు బ్యాంకు కాలనీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. దేశాన్ని అంగవైకల్య రహితంగా తీర్చిదిద్దాలంటే 0 నుంచి 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఈ రెండు చుక్కలు చిన్నారుల నిండు జీవితానికి రక్షణ కవచంగా నిలుస్తాయని పేర్కొన్నారు. పట్టణంలో 0-5 సంవత్సరాల వయస్సు గల చిన్నారుల తల్లిదండ్రులందరూ తమ తమ వార్డుల్లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాలకు పిల్లలను తీసుకెళ్లి పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# నిండు జీవితానికి రెండు చుక్కలు తప్పనిసరి : ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఐదు సంవత్సరాల లోపు చిన్నారుల నిండు జీవితానికి పోలియో చుక్కలు వేయించటం తప్పనిసరి అని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండపేట పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు. పోలియో లాంటి ప్రమాదకర వ్యాధుల నుంచి చిన్నారులను రక్షించేందుకు ఈ కార్యక్రమం కీలకమన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ దగ్గర నుండి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే వేగుళ్ళ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండపేట పట్టణ టీడీపీ అధ్యక్షులు మత్స నాగు, కురసాల సత్యనారాయణ, బీజేపీ నాయకులు కోన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### చీపురుపల్లిలో బాధిత కుటుంబానికి

# సీపీఐ(ఎంఎల్) పార్టీ అండ

### కందికట్ల బేబీకి రూ.5 వేల ఆర్థిక సాయం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం చీపురుపల్లి గ్రామానికి చెందిన కందికట్ల రత్నరాజు అనారో గ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర కార్య దర్శి పలివెల వీరబాబు ఆదివారం పరామర్శించారు. ఈ సంద ర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి కష్టసుఖాల్లో పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.మృతుడి భార్య కందికట్ల బేబీకి పలివెల వీరబాబు చేతుల మీదుగా రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుం బం ప్రస్తుతం తీవ్ర విషాదంలో ఉంద ని, ఇలాంటి సమయం లో సమా జంలోని ప్రతి ఒక్క రూ బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడు తున్న కందికట్ల రత్నరాజు చికిత్స పొందుతూ మృతి చెందడం బాధా కర మని పలివెల వీరబాబు అన్నా రు. బాధిత కుటుంబానికి అవసర మైన సహాయ సహకారాలు అందిం చేందుకు పార్టీ తరపున ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్య కర్తలు, గ్రామస్తులు పాల్గొని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

### స్వర్గీయ బీవీ రమణయ్య జయంతిని

# ఘనంగా నిర్వహిద్దాం : రామకృష్ణ



**ముమ్మిడివరం,విశ్వం వాయిస్ న్యూస్:** భారత రిపబ్లికన్ పార్టీ మాజీ ఎమ్మెల్యే బీవీ రమణయ్య జయంతిని జూలై 17న పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని ఆర్.పి.ఐ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ దడాల రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కన్వెన్షన్ హాల్లో ఆర్పిఐ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ దడల రామకృష్ణ అధ్యక్షతన రాష్ట్ర కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు ముఖ్య నాయకులు ప్రసంగించారు. ఈ సందర్భంగా జులై 17న మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ బివి రమణయ్య జయంతిని ఘనంగా ఆ పార్టీ శ్రేణులకు అభిమానులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మట్ట వెంకట్రావు మాట్లాడుతూ పార్టీని గ్రామస్థాయి నుండి బలుపేతం చేయడంతో పాటు, బడుగు బలహీన వర్గాల సమస్యలపై నిరంతరం పోరాటం చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ, గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైందని ఆయన ఆరోపించారు. గురుకుల పాఠశాలలు సమస్యపై జిల్లా కన్వీనర్ చీకురుమల్లి శ్రీనివాస్ ను, పార్టీ నాయకులు స్పందించిన తీరును సమావేశం అభినం దించింది. స్వర్గీయ బీవీ రమణయ్య జయంతి సభలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా నూతన కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో ముమ్మిడివరం నియోజకవర్గం నుండి తమ పార్టీ అభ్యర్థిని పోటీలో ఉంచడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు జిల్లా కన్వీనర్ చీకురుమల్లి శ్రీనివాస్ ,ఎన్.ఎం రుషి, బల్ల సత్యనారాయణ, గిడ్డి జ్ఞాన ప్రకాష్, మట్ట వెంకటరావు, ఉచ్చుల సాల్మన్ రాజు,జనుపల్లి సత్యనారాయణ,కుంచే చినబాబు, గిడ్డి ప్రసాద్,ఎలమంచిల సురేష్, కాశి సిద్ధార్థ కుమార్, కలకట రమణ తదితరులు పాల్గొన్నారు.

# హిందూ సమాజాన్ని సంరక్షించిన అగ్రగన్యుడు చత్రపతి శివాజీ

### జనసేన నాయకులు డాక్టర్ బోండా సూర్యారావు




**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కరప మండలం వేళంగి గ్రామంలో ఆదివారం బోండా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బొండా వెంకన్న రావు ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకినాడ రూరల్ జనసేన నాయకులు డాక్టర్ బోండా సూర్యారావు హాజరయ్యారు. హిందూ సామ్రాజ్య దినోత్సవం గురించి మాట్లాడారు.చత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకం వార్షికోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం దేశంలో హిందూ ధర్మాన్ని, దేశ సంస్కృతిని కాపాడటంలో శివాజీ చూపిన శౌర్యాన్ని స్మరించుకుంటూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం (ఆర్ఎస్ఎస్) మరియు వివిధ హిందూ సంస్థలు ఈ రోజున హిందూ సామ్రాజ్య దినోత్సవంగా జరుపుకుంటారని, శివాజీని 1674 జూన్ 6న రాయగడ్ కోటలో వేద మంత్రాలు మధ్య క్షత్రియ రాజులందరికీ అధిపతిగా కీర్తిస్తూ చత్రపతి బిరుదును ప్రధానం చేశారని, మనదేశంలో హిందూ ధర్మాన్ని హిందూ సంస్కృతిని హిందూ సమాజాన్ని సంరక్షించిన వారిలో అగ్రగనుడుగా పేరుగాంచిన వీరుడని, యువతలో శౌర్యం పౌరుషం మరియు దేశభక్తిని పెంపొందించేలా చత్రపతి మహారాజ్ శివాజీ చేసిన త్యాగాలను చాలా క్లుప్తంగా వివరించారు. ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు, మన దేశం కోసం ఎంతో పోరాటం చేసిన వీరుడని మాట్లాడారు. హిందూ ధర్మాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఈ సభకు హాజరైన ఆర్ఎస్ఎస్ కార్యదర్శులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యదర్శిలు దుర్గా రెడ్డి, ఎన్ వి రామారావు, వేలంగి గ్రామ ఆర్ఎస్ఎస్ సభ్యులు డి ఈశ్వర్ శర్మ, యు. శ్రీనివాస్,ఎస్. శ్రీనివాస్,ఎస్. నాగేశ్వరరావు కే. సుబ్రహ్మణ్యం, ఎం.విజయ భారతి, పోలిశెట్టి తాతీలు దూడల నారాయుడు, కర్నేడి శివ, శాఖశ్రీనివాస్, గోవిందు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# మిత్ర హార్ట్ ఇన్స్టిట్యూట్‌లో పాత్రికేయులకు ఉచిత వైద్య శిబిరం



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న ప్రముఖ వైద్య సంస్థ 'మిత్ర హార్ట్ ఇన్స్టిట్యూట్, మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్'లో ఆదివారం కాకినాడ రూరల్ పాత్రికేయులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గుండె వైద్య రంగంలో విశేష సేవలు అందిస్తూ, ప్రత్యేక మైలురాళ్ళను అధిగమిస్తున్న ప్రముఖ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డా. జి. ఓబుల్ రెడ్డి నేతృత్వంలో ఈ శిబిరం జరిగింది. ఈ సందర్భంగా సుమారు వందమంది పాత్రికేయులకు మరియు వారి కుటుంబ సభ్యులకు ఆధునిక గుండె చికిత్సా (కార్డియాక్) వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు బిపి, షుగర్, ఈసిజి , టూడీకో , మరియు వివిధ రకాల రక్త పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. నాణ్యమైన, సురక్షితమైన, అత్యాధునిక వైద్య సేవలను అందిస్తూ ఉభయ గోదావరి జిల్లాల ప్రజల నమ్మకాన్ని మిత్ర హార్ట్ ఇన్స్టిట్యూట్ చూరగొంది. ఈ హాస్పిటల్‌లో ఇప్పటివరకు జరిగిన మొత్తం చికిత్సల్లో 99.6 శాతం విజయవంతమైన ఫలితాలు నమోదు కావడం విశేషం. ఈ సందర్భంగా ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ జి. ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ "రాత్రి పగలు తేడా లేకుండా, నిరంతరం వార్తల సేకరణలో నిమగ్నమై ఒత్తిడికి గురయ్యే జర్నలిస్టులు తరచుగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, తమ హాస్పిటల్‌లో ఇప్పటివరకు 500 పైగా విజయవంతమైన ఆపరేషన్లు,చికిత్సలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని, సామాజిక బాధ్యతగా పాత్రికేయులందరికీ ఈ ఉచిత వైద్య సేవలను అందించామని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలను స్థానికంగా అందిస్తూ, జర్నలిస్టుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన డాక్టర్ ఓబుల్ రెడ్డికి, మిత్ర హార్ట్ ఇన్స్టిట్యూట్ యాజమాన్యానికి కాకినాడ రూరల్ పాత్రికేయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, వైద్యులు మరియు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

# హసన్ బాదలో నరేంద్ర మోదీ 135వ 'మన్ కీ బాత్' వీక్షణ



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం మండలంలోని హసన్ బాద గ్రామం సమీకృత బాలుర వసతి గృహంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన 135వ 'మన్ కీ బాత్' కార్యక్రమ ప్రసార వీక్షణ ఏర్పాట్లు జరిగాయి. జిల్లా మన్ కీ బాత్ కన్వీనర్ నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు, వసతి గృహ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ప్రధానమంత్రి దేశ భద్రత, ఆత్మనిర్భర్ భారత్, శాస్త్రీయ దృక్పథం, పర్యావరణ పరిరక్షణ, యోగ, సామాజిక బాధ్యత వంటి పలు కీలక అంశాలపై దేశ ప్రజలకు సందేశాన్ని ఇచ్చారు. సముద్రాల నుంచి ఆకాశం వరకు భారత్ స్వయం సమృద్ధి సాధిస్తోందని చెప్తూ.. స్వదేశీ రక్షణ తయారీ, జ-295 విమానాల ఉత్పత్తి, భారత నౌకాదళంలో చేరిన స్వదేశీ యుద్ధనౌకల పురోగతిని ప్రస్తావించారు. ప్రజలు మూఢనమ్మకాలకు దూరంగా ఉంటూ శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని కోరారు. అంతర్జాతీయ యోగ దినోత్సవానికి ప్రపంచవ్యాప్తంగా లభిస్తున్న ఆదరణ భారతీయ సంస్కృతికి దక్కిన గౌరవమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో పర్యావరణ పరిరక్షణ, క్రీడల అభివృద్ధి, జీవ వైవిధ్య సంరక్షణలో స్థానిక ప్రజలు చేస్తున్న కృషిని ప్రశంసించారు. సామాజిక భద్రత పథకాల ద్వారా కోట్లాది కుటుంబాలకు బీమా రక్షణ అందుతోందని వివరించారు. దేశాభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, 'వికసిత్ భారత్' నిర్మాణానికి ప్రజల సహకారం అత్యంత అవసరమని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో, ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపును ప్రజలందరూ ఆచరణలో పెట్టి దేశాభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని నాగిరెడ్డి సతీష్ రావు కోరారు.

# లాకప్ డెత్ కేసులో సిట్ దర్యాప్తుపై పలు సందేహాలు

### సీబీఐతో విచారణ జరిపించాలి - తూర్పుగోదావరి జిల్లాలోను ఇదే తరహా లాకప్ డెత్ - మేడా శ్రీనివాస్ డిమాండ్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కృష్ణలంక లాకప్ డెత్ కేసులో ముద్దాయిగా ఉన్నటు వంటి సిఐ నాగరాజుకు ప్రాణహాని వుందని , ప్రభుత్వం భద్రత కల్పించాల్సిన అవసరం వుందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టి వారాంతపు సమావేశంలో అర్పిసి వ్యవస్తాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ అనుమానం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ ఇప్పటికే ఈ లాకప్ డెత్ కేసులో శాస్త్రీయ పరమైన ఆధారాలను విస్మరిస్తున్నట్టుగా కనపడుతుందన్నారు. ప్రత్యేక ఇన్వెస్టిగేషన్ గా సిట్ ను నియమించినా రాజకీయ, అధికారిక ఒత్తిడి లకు సిట్ తలోగ్గకుండా నేర పరిశోధనను నిర్వహించగలదా ! ఈ తరహా నేరాల్లో అనేక జిల్లాల్లో కొంతమంది నిష్టాతులు ఉన్నారన్నారు. నిజానికి పోలీస్ కానిస్టేబుల్ నుండి ఎస్ ఐ వరకు వారి జీవితాలకు స్వేచ్ఛ , హక్కులు ఉండవన్నారు. పోలీస్ బాసిజానికి తలోగ్గుతు ఉద్యోగం చేయాల్సిందేనన్నారు . పోలీస్ బాస్ లకు , కానిస్టేబుల్ నుండి ఎస్ ఐ వరకు పోలీస్ చట్టాలు , రూల్స్ వర్తింపబడవు , అన్ని మౌకిక ఆదేశాలే నడుస్తుంటాయి . ఏదైనా న్యాయపరమైన ఇబ్బందులు ఎదురైతే కానిస్టేబుల్ - ఎస్ ఐ వరకు ఆ ఖర్మను మోయాల్సిందే నని , ఉపయోగించుకున్న పోలీస్ ఉన్నత అధికారి వారికి కనీసం అండగా నిలవరన్నారు . ఒక వికృతపు వాతావరణం పోలీస్ శాఖలో కొంతమంది వద్ద ఉంటుంది. సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో ఎప్పటికి సమాధానం దొరకని ఈ సందేహాలను నివృత్తి చేయగలరా !

(1) వారెంట్ వెనుక పేరు వ్రాస్తారు కదా ! ఆ వారెంట్ పై సాయి కృష్ణ పేరు వ్రాసినట్టు వుందా !

(2) వారెంట్ పై సాయికృష్ణ ను తెచ్చినప్పుడు మార్కాపురం లో జీ డి ఎంట్రీ పెట్టి తెచ్చానంటున్న పోలీస్ వివరణ ప్రకారం కృష్ణ లంక పోలీస్ స్టేషన్ లో ఆ సమాచారాన్ని సెంట్రి బుక్కులో నమోదు చేసారా !

(3) కృష్ణలంక పోలీస్ స్టేషన్ లో సెంట్రి బుక్కు ఎవరు మెంటేన్ చేసారు . కనీసం సర్వే లైన్స్ బుక్కు ఎవరు మెంటేన్ చేసారో చెప్పగలరా !

(4) ప్రతి రోజు లాకప్ "డి ఎస్ ఆర్ "ఉంటుంది. అందులో సాయికృష్ణ పేరు అన్ని రోజుల్లో ఎన్నడైనా వుందా ! అలాంటప్పుడు రిమాండ్ రిపోర్ట్ లో ఎస్ ఐ చెప్పారంటున్న సాక్ష్యానికి విలువ ఉంటుందా !

(5) ప్రస్తుతం సాయి కృష్ణ ను పోలీస్ స్టేషన్ లో చూసాను అని చెప్పుచున్న ఎస్ ఐ సాక్ష్యం లో నిజమేంత ! ఫ్లిప్ కార్డు బాయ్ సాక్ష్యంలో నిజమేంత ! అబద్దమెంత..

(6) ప్రస్తుతం సాక్ష్యం చెప్పిన ఎస్ ఐ సాక్ష్యం న్యాయస్థానం లో వీగిపోతే ముద్దాయి నాగరాజు కు మేలు జరిగినట్టే కదా ! కేసు పోయినట్టే కదా !

(7) సిసి పుటజీలు మాయం చేయటం ఒక సి ఐకు సాధ్యం కాదు. అందుకు అతనికి గల అధికారం సరిపోదు . ఎవరి భరోసా మేరకు నాగరాజు ఇంత పెద్ద నేరం చేసారో అనేది ఋజువు కావాల్సి వుంది .

(8) సాయికృష్ణను మార్కాపురం నుండి తీసుకు రమ్మని టాస్క్ ఫోర్స్ సిబ్బందిని ఆదేశించే అధికారం సి ఐ నాగరాజుకు ఉంటుందా !

(9) బస్ స్టాండ్ లో అనాధ శవాలుగా గుర్తించినది ముందుగా ఎవరు! ఆ మొత్తం ప్రక్రియకు సంబంధించి ఆ ప్రాంతంలో సి సి పుటజీలు ఏమైనట్టు .

(10) అనాధ శవంగా బావించిన పోలీస్ , శానిటేరి , రెవిన్యూ వారితో కలిసి నిబంధనలు ప్రకారమే విధ్యుత్ ఖననం జరిపించారా !

(11) స్వర్గపురి స్మశానం లో పూర్తి వివరాలు విచారించిన తదుపరి విధ్యుత్ ఖననం చేసారా ! విధ్యుత్ ఖననం జరిపిన సిబ్బంది పాత్రపై కూడా సరైన విచారణ జరగాల్సి వుంటుంది.

(12) వారెంట్ అమలు చేసిన టాస్క్ ఫోర్స్ పోలీస్ మార్కాపురం పోలీస్ వద్ద జీ డి ఎంట్రీ నమోదు చేసారా ! అక్కడ నుండి కృష్ణ లంక పోలీస్ స్టేషన్ వరకు ఎంత మంది పోలీస్ లు పాల్గున్నారు. అందుకు భాద్యులుగా వున్నారు .

(13) శానిటరి , రెవిన్యూ , స్వర్గపురి స్మశానం వరకు వ్యవహారం నడిపించిన వారి మొత్తం స్టేట్మెంట్స్ నిబంధనలు మేరకు నమోదు కాబడ్డాయా ! ఆ వివరాలు మొత్తం రిమాండ్ రోపోర్ట్ లో ఎందుకు పేర్కొనలేదు .

(14) అనాధ శవాలుగా చెబుతున్న వారిలో నిజమైన అనాదులు ఉన్నారా ! సాయికృష్ణ వంటి అభాగ్యులే ఉన్నారా ! ఆ శవాల విధ్యుత్ ఖననంలో సాయికృష్ణ వంటి వారే ఆ మూడు రోజులు ఖననం కాబడ్డారా ! అనాధ శవాలుగా వచ్చినట్టు చెబుతున్న వారికి సాయికృష్ణ మరణానికి ఏమైనా సంబంధం వుందా !

(15) కృష్ణ లంక పోలీస్ స్టేషన్ లో జరిగిన లాకప్ డెత్ లో లాకప్ "డి ఎస్ ఆర్," సెంట్రి బుక్కు , సర్వే లైన్స్ బుక్కు చాలా కీలకం కాబోతుంది . ఈ అంశాలను రిమాండ్ రిపోర్ట్ లో ఎందుకు చేర్చలేదు .

(16) చివరికు ముద్దాయిగా వున్న సి ఐ నాగరాజు ఈ కేసులో బలిపసువు కాబోతున్నారా ! కీలకమైన వారు తప్పించుకోబోతున్నారా !

విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్ లాకప్ డెత్ కు సరి సమానమైన "ఎమ్. ఓ" లో తూర్పుగోదావరి జిల్లాలో ఒక లాకప్ డెత్ జరిగింది. ఈ తరహా కేసుల విచారణ కోసం ప్రత్యేక విభాగాన్ని నియమించి కాలయాపన లేని నేర పరిశోధనను ప్రోత్సహించాలి . నేర రహిత సమాజం కోసం మేము సైతం ప్రభుత్వ సేవలకు సిద్దం అని తెలియచేసుకొనుచున్నాముని మేడా శ్రీనివాస్ పేర్కొన్నారు.

# చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పట్టణంలోని మార్కెట్ సమీపంలోని ఈడబ్ల్యూఎస్ (ఈ డబ్ల్యూ ఎస్) కాలనీలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సి)లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలోని చిన్నారులకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు కలిసి స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం, పోలియో రహిత భారతదేశం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, వారి భవిష్యత్తుకు రక్షణ కల్పించాలని అన్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రతి చిన్నారికి వ్యాక్సిన్ అందేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి పార్టీల ముఖ్య నాయకులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు

**అక్రమ కేసులతో శెట్టిబలిజల అణిచివేతపై సంఘీయుల ఆగ్రహం - శెట్టిబలిజ ఓట్లతో గెలిచి శెట్టిబలిజల అణిచివేతపై సంఘీయుల ఆగ్రహం**

**రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న శెట్టిబలిజ నాయకులు కూటమి ప్రభుత్వ తీరుపై విమర్శలు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం పక్కనపెట్టి, లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని, ప్రజా సమస్యలపై గొంతు ఎత్తే ప్రతిపక్షాల గొంతును నొక్కుతున్నారని, ప్రజాస్వామ్య ,ప్రాథమిక హక్కులను కాల రాస్తున్నారని, రాజకీయంగా బీసీలను ఎదగనీయకుండా అక్రమ కేసులతో అణగతొక్కుతున్న కూటమి ప్రభుత్వానికి బీసీలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గర పడుతున్నాయని వైసిపి పార్టీ జిల్లాకు చెందిన శెట్టిబలిజ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవ రంలో మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ అధ్యక్షతన ఆదివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్ లోని శ్రీ గ్రాండ్ కాన్ఫరెన్స్ హాల్లో శెట్టిబలిజ సంఘీయుల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈవిఎం నగర ఎమ్మెల్యే ఒత్తిడితో ఇటీవల నగరంలో వైసిపి బీసీ నాయకుడు పీతారామకృష్ణను పోలీసులు పి డి చట్టం ప్రయోగించి సెంట్రల్ జైలుకు పంపించిన సంగతి విధితమే. ఈ అక్రమ చర్యను ఖండిస్తూ శెట్టిబలిజ సంఘీయుల ఐక్యత కోసం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైసిపి నాయకులు మాజీ మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ, నిన్న అమరావతిలో జరిగిన సంఘటన రాష్ట్రంలో రెడ్బుక్ రాజ్యాంగం అమలు జరుగుతుందని అనడానికి ప్రత్యక్ష నిదర్శనం అన్నారు. జిల్లాలో ఓటు బ్యాంకు శక్తిగా శెట్టిబలిజలు అధికంగా ఉన్నారని అలాంటి వారిపై గెలిసిన ప్రజాప్రతినిధులు అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురి చేయడం దారుణమన్నారు. రాష్ట్ర బీసీ ఐక్యవేదిక నాయకులు మార్గాని నాగేశ్వరావు మాట్లాడుతూ, బీసీ కులాలను రాజకీయంగా ఎదగనీయకుండా చంద్రబాబు నాయుడు మొదటి నుంచి కుట్రలు చేస్తూనే ఉన్నారని విమర్శించారు. కుటమి పార్టీల బలంతో శెట్టిబలిజలను అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. తమ పార్టీ బీసీ యువకుడు, నాయకుడు రామకృష్ణ పై పెట్టిన పీడీ యాక్ట్ పెట్టడం దారుణమని అన్నారు. కార్మిక నాయకుడు వాసంశెట్టి గంగాధర్ రావు మాట్లాడుతూ, ప్రతిపక్ష పార్టీలో క్రియాశీలకంగా ప్రజల పక్షాన పోరాడుతున్న ప్రశ్నిస్తున్న యువ నాయకులపై కార్యకర్తలపై అక్రమ పోలీసు కేసులు పెట్టడం రాజకీయంగా తగదన్నారు. అధికారం శాశ్వతం కాదని, బళ్ళు ఓ డలు ఓడలు బలుపాతాయి అన్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు. కోడి ప్రవీణ్, న్యాయవాది ఇల్లా భాస్కరరావు తదితరులు మాట్లాడుతూ, రాజకీయాల్లో కక్ష సాధింపు చర్యలు తగవని, చట్టం, న్యాయ పరిధిలోనే సమస్యల పరిష్కరించు కోవాల్సిందని ఏ వ్యక్తి అయినా రాజ్యాంగానికి అతీతులు కాదన్నారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గత రెండేళ్లుగా వైసిపి నాయకులు, కార్యకర్తలపై సాగిస్తున్న అరాచకాలకు బదులు తీర్చుకుంటామని గుర్తించుకోవాలన్నారు. ప్రశ్నించే వైసిపి వారిపై ముఖ్యంగా రామకృష్ణకు అన్యాయం జరిగిందని, శెట్టి బలిజ సంగీయులు ఐక్యంగా ఉంటే కచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు. నిజంగా నేరాలు చేసేవాడు అయితే 12 కేసులు ఉన్న అతనిపై 10 కేసులు కోర్టు, పోలీస్ శాఖ ఎందుకు కొట్టివేస్తాయని అని ప్రశ్నించారు. రెండు కేసులు ఉన్న వ్యక్తి మీద పిడి చట్టం అమలు చేస్తారా! ప్రశ్నించిన వారిపై పి డి చట్టం ప్రయోగిస్తారా ! ఈవీఎం ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు. నిన్నగాక మొన్న రాజధాని అమరావతిలో రైతుల పక్షాన నిలబడిన వైసీపీ నాయకుల పర్యటనను అడ్డుకోవడమే కాకుండా అధికార పార్టీ గుండాలచేత రాళ్ల దాడి చేయించడం చూస్తుంటే కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు తేటతెల్లమవుతున్నాయని ప్రజలు గుర్తించాలని కోరారు.

**నగరంలో ఈవీఎం ఎమ్మెల్యే కక్ష సాధింపు చర్యలు**

నగరంలో ఈవీఎం ఎమ్మెల్యే కక్ష సాధింపు చర్యలు మితి మీరాయని, ఈ రెండేళ్లలో తన మీదే 16 - 17 కేసులు అక్రమంగా పెట్టారన్నారు. తన పాస్పోర్టును అన్యాయంగా రెండేళ్లుగా పోలీస్ స్టేషన్‌లో ఆపేసారని, దానితో తాను హైకోర్టును ఆశ్రయించానని, తనపై ఉన్న ఎనిమిది కేసుల వరకు కొట్టేసారని హైకోర్టుకు తెలపగా పాస్పోర్టు రిలీజ్ చేయమని ఆదేశించింద న్నారు. ఈవీఎం ఎమ్మెల్యే ఒత్తిడితో మళ్లీ పోలీస్ అధికారులు తనపై మరో ఏడు కేసులు అక్రమంగా బనాయించారని ఈవీఎం ఎమ్మెల్యే పాస్పోర్ట్ అధికారిపై ఒత్తిడి చేయించి పాస్పోర్ట్ ను నిలిపివేశారన్నారు. ఈ ప్రభుత్వ శెట్టిబలిజల అణిచివేత ప్రయత్నాలను శెట్టిబలిజ ఉప కులాలన్నీ కలిసికట్టుగా ఎదుర్కోవాల్సి ఉందన్నారు. గత రెండేళ్లుగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో డాక్టర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని పక్కనపెట్టి లోకేష్ రెడ్ బుక్కు రాజ్యాంగం నడుస్తోందని విమర్శించారు. కళా, సాంస్కృతిక చారిత్రాత్మక నగరమైన రాజమహేంద్రవరంలోను ఎప్పుడూ రాజకీయ కక్ష సాదింపు చర్యలు చూడలేదని అన్యాయాలు, అక్రమాలను ప్రశ్నించిన గొంతుకలను నోక్కేయడం అరెస్టు చేయడం, శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన పీతా రామకృష్ణ ను అక్రమంగా అరెస్టు చేయడం, ఈ ప్రభుత్వ, ఈవిఎం ఎమ్మెల్యే కక్ష సాధింపు చర్యలకు నిదర్శమన్నారు. రామకృష్ణ అరెస్టు చేయగానే 40 వార్డుల్లో పేకాట క్లబ్బులు, బ్రాకెట్ క్లబ్బులు ఊపందుకు న్నాయని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ లోనే రెండు గ్రూపులు తలలు పగిలేగా కార్లు ధ్వంసం అయ్యేలా కొట్టుకున్నా యన్నారు. ఈ రెండు వర్గాలను ఈవీఎం ఎమ్మెల్యే సెటిల్మెంట్ చేయోగా, కొట్టిన వాడికి అనుకూలంగా ఎమ్మెల్యే మాట్లాడడంతో దెబ్బతిన్న వారు ఎదురు తిరిగారని అన్నారు. ఈ సంఘటన తన దృష్టికి వచ్చిందని,తాను శాంతి సమస్యల దృష్ట్యా ఈ సమస్యపై సోషల్ మీడి యాలో పోస్ట్ చేయడం జరిగిందన్నారు. ఈ పోస్ట్ తొలగించాలని తనకు తన పార్టీ అనుచరులకు తీవ్ర వత్తుడిలు వచ్చ యన్నారు. అయినప్పటికీ తాము బెదరలేదని 40 వార్డు కాదు నగరంలో ఏ వార్డులోనూ మాజీ ఎంపీ భరత్ తిరగనిచ్చేది లేదని టిడిపి కార్యకర్తలు సవాల్ చేయడంతో పీతారామకృష్ణ అవార్డులో వైసిపి జెండాతో తిరగడంతో ఈవీఎం ఎమ్మెల్యే తట్టుకోలేక అతనిపై పిడి చట్టం పెట్టారని ఆరోపించారు. వార్డులో తిరిగినందుకే పిడి చట్టం పెట్టేస్తారా ఈ అక్రమాన్ని హైకోర్టులో సవాల్ చేస్తానని, న్యాయ పోరాటం చేస్తానని అతని కుటుంబానికి అండగా ఉంటామనిన్నారు. జిల్లా కలెక్టర్ రేట్‌లో పిజిఆర్ఎస్లో ఫిర్యాదు చేశానని జిల్లా కలెక్టర్ సంబంధిత డిఎస్పిని వివరణ కోరింరని ఆయన సమాధానం చెప్పలేకపో యారనన్నారు. హంతకులు, గంజాయి బాచ్‌లు, సమాజానికి ప్రమాదకరంగా మారిన మావోయిస్టు, టెర్రరిస్టులపై పెట్టవలసిన పీడి చట్టాన్ని ప్రశ్నించిన రామకృష్ణ పై కక్ష సాధింపుగా ఆగమేఘాలపై వైద్య పరీక్షలు జరిపి సెంట్రల్ జైలుకు పంపించడం దారుణమన్నారు. ఇవన్నీ రాబోయే రోజుల్లో చేస్తామని ఈవిఎం ఎమ్మెల్యే గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు, శెట్టి బలిజ సంగీయులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# జనసేన నాయకుడు అల్లంపల్లి ప్రసాద్ జన్మదిన సేవలు

**స్ఫూర్తిచారిటబుల్ వృద్ధులకు భోజనాలు వితరణ**



**ధవలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదివారం ఉదయం రాజమహేంద్రవరం రూరల్ ధవలేశ్వరం గ్రామంలో స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం వద్ద జనసేన పార్టీ నాయకుడు అల్లంపల్లి ప్రసాద్ పుట్టినరోజు వేడుకలు స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ముత్యాల పోసి సత్య దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్ మాట్లాడుతూ అందరివాడు స్నేహశీలి అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తి జనసేన పార్టీ నాయకుడు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అనుచరుడు అల్లంపల్లి ప్రసాద్ పుట్టినరోజు వేడుకలు స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధుల మధ్య నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని. ఇలాంటి సేవా మూర్తిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి వృద్ధులకి దివ్యాంగులకు నిరాశ్రయులకు భోజనాలు అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధులు దివ్యాంగులు పాల్గొన్నారు.

# నీతి నిజాయితీ గల నాయకుడు ముద్రగడ

**ప్రజల్లోకి క్షేమంగా రావాలి - ముద్రగడ ఆరోగ్యం మెరుగుపడాలని జక్కంపూడి ఆధ్వర్యంలో మహామృత్యుంజయ హోమం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ మంత్రి వైసిపి పిఏసి సభ్యులు ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడి సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ఇంటికి క్షేమంగా చేరాలని జక్కంపూడి విజయలక్ష్మి మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. జక్కంపూడి విజయలక్ష్మి, జక్కంపూడి రాజా మాట్లాడుతూ హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించిన ఆసుపత్రిలో ముద్రగడ పద్మనాభం చికిత్స పొందుతున్నారని ఆయనకు అందుతున్న వైద్య సేవలో ప్రజలు ఎటువంటి అపోహలు పడవద్దని వైయస్ జగన్మోహన్ రెడ్డి కోరిక మేరకు సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్ నోరి దత్తాత్రేయులు వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. నీతి నిజాయితీ గల నాయకుడు రాష్ట్రంలో రాజకీయాలకు ప్రత్యేక గుర్తింపుగా మంచి నాయకుడిగా ముద్రగడ పద్మనాభం కు గుర్తింపు ఉందని అటువంటి వ్యక్తి ఆయురారోగ్యాలతో తిరిగి క్షేమంగా ఇంటికి చేరుకోవాలని హోమం నిర్వహించమని తెలిపారు.

# పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలి

**పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రారంభించిన కుడుపూడి సత్తిబాబు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాజమహేంద్రవరం నగరంలోని స్థానిక 3వ వార్డులోని రచ్చబండ కేంద్రం మరియు బిలాల్ షాది ఖానా కేంద్రం వద్ద నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు పాల్గొని ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆరోగ్యవంతమైన చిన్నారులే రాష్ట్రానికి, దేశానికి బలమైన భవిష్యత్తుకు పునాదులని పేర్కొన్నారు. పోలియో వంటి ప్రమాదకర వ్యాధులు పూర్తిగా నిర్మూలన కావాలంటే ప్రతి తల్లిదండ్రి ప్రభుత్వ నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో తప్పనిసరిగా భాగస్వాములు కావాలని కోరారు. అలాగే రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో నగరంలో ప్రభుత్వ సంక్షేమ, ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసే దిశగా నిరంతరం చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఎదగాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో వైరస్ వ్యాప్తిని పూర్తిగా అరికట్టవచ్చని తెలిపారు. తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా సమీపంలోని పోలియో కేంద్రాలకు వెళ్లి తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రజల సహకారంతో మాత్రమే పోలియో రహిత దేశం సాధ్యమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, స్థానిక కూటమి పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

**పిన్నమరెడ్డి ఈశ్వరుడు మనవరాలు దేవాన్షి రమను**

# ఆశీర్వదించిన ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం రూరల్ కోలమూరు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పిన్నమరెడ్డి ఈశ్వరుడు, సొసైటీ అధ్యక్షులు అడ్డాల శ్రీను వారి మనవరాలు చిరంజీవి దేవాన్షి రమ మొదటి పుట్టినరోజు వేడుక,అలాగే ది.రాజమండ్రి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు తవ్వ సూర్యనారాయణ మూర్తి (రాజా) వారి కుమారుడు రిశ్వంత్ రాజ్ ఉపనయన కార్యక్రమాల్లో పాల్గొని చిన్నారిని రాజమహేంద్రవరం రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు,జనసేన నాయకులు ప్రముఖ నాయకులు తదితరులు విచ్చేసి ఆశీర్వదించారు.

# ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరి

**జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** విఎల్‌పురం రైతు బజార్ సమీపంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో ఆదివారం నిర్వహించిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరై ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యమే దేశ భవిష్యత్తుకు బలమైన పునాది అని అన్నారు. ఒక చిన్న పోలియో చుక్క జీవితాంతం ఒక చిన్నారిని వికలాంగత్వం నుంచి కాపాడగలదని, అందుకే ప్రతి తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు. పోలియో వైరస్ మళ్లీ వ్యాపించకుండా ఉండాలంటే ప్రతి జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో అర్హులైన ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా చూడటం మనందరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, తమ ఇంట్లోనే కాకుండా బంధువులు, పొరుగువారి ఇళ్లలో కూడా ఐదేళ్లలోపు పిల్లలు ఉంటే వారిని సమీపంలోని పోలియో కేంద్రానికి తీసుకెళ్లి చుక్కలు వేయించాలని కోరారు. “రెండు చుక్కలు - నిండు జీవితానికి రక్ష” అనే సందేశాన్ని ప్రతి ఇంటికి చేరవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్న వైద్యశాఖ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వాలంటీర్లు, మున్సిపల్ సిబ్బందికి ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. 10వ డివిజన్ ఇంచార్జ్ చొప్పర్ల భద్రరావు, సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

**గుండె వ్యాధులను**

# ఎలా గుర్తించాలో అవగాహన

**దేవరపల్లి పీఎంపీల నూతన కమిటీ ఏర్పాటు**



**దేవరపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామాల్లో పీఎంపీలు అందించే సేవలు అభినందనీయమని ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ గీతాశ్రవణ్ అన్నారు. ఆదివారం కమ్యూనిటీ పారామెడిక్స్ & ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పీఎంపీ అసోసియేషన్) తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండల సర్వసభ సమావేశం, కార్యవర్గ ఎన్నికలు జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు అధ్యక్షతన యర్నగూడెం అంజనా ఎ6 హెటల్ కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా రాజమండ్రికి చెందిన గోదావరి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ న్యూరో సర్జన్ డాక్టర్ గీతాశ్రవణ్ విచ్చేసి మాట్లాడుతూ పీఎంపీలు గ్రామాల్లో అందించే సేవలు అమోఘమని నిత్యం అందుబాటులో ఉంటూ చక్కటి సేవలందిస్తున్నారని అభినందించారు. పీఎంపీలకు మెదడు, వెన్ను పాముకు సంబంధించిన వ్యాధులు గురించి, ఎవరికైనా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినప్పుడు తొలి మూడు గంటలలో చేసే చికిత్సే వారిని పక్షవాతం బారిన పడకుండా చేస్తుందని తెలిపారు. బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వారిని ఏ విధంగా గుర్తించాలి ఏ విధమైన ప్రాథమిక చికిత్స అందించాలో వివరించారు. కార్డియోలజిస్ట్ డాక్టర్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ నేటి జీవనశైలిలో వచ్చిన మార్పులతో గుండెకు సంబంధించిన వ్యాధులకు గురవుతున్నారని, గుండె వ్యాధులను ఎలా గుర్తించాలో తెలిపారు. బ్రెయిన్ స్ట్రోక్ గానీ, హార్ట్ ఎటాక్ గానీ సరైన సమయంలో గుర్తించి వైద్యం అందించినప్పుడే వారి ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. తొలుత జరిగిన మండల కార్యవర్గ ఎన్నికలలో మామిడిపల్లి వెంకటరావు మండల నూతన కమిటీ అధ్యక్షులుగాను,దాసరి సత్య భాస్కర్ మండల నూతన కమిటీ కార్యదర్శిగా,ఆకుల నాగేశ్వరరావు నూతన కమిటీ కోశాధికారిగా,సీహెచ్ కామరాజు గౌరవ అధ్యక్షులుగా,మండలపాటి బాల బ్రహ్మానందం ఉపాధ్యక్షులుగా, తుమ్మలపల్లి సురేష్ బాబు సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం జరిగింది. ఈ నూతన కమిటీని జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పీ దేవానందం, జిల్లా కోశాధికారి పి.చిన్ని సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జె రాము,టి రామకోటేశ్వరరావు, ఎల్ శ్రీనివాస్, ఎమ్ సుబ్రహ్మణ్యం, ఎస్ సత్యనారాయణ, కైరం రాణి తదితరులు పాల్గొన్నారు.

# పోలియో రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ : బొడ్డు



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రాన్ని పోలియో రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. ఆదివారం పల్స్ పోలియో దినోత్సవం సందర్భంగా నియోజవర్గంలో కోటి కేశవరం తదితర గ్రామాలలో చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేయించాలని, ప్రాథమిక వైద్యాధికారులతో పాటు తల్లిదండ్రులు, సమాజంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా పోలియో రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి భాగస్వామ్యం కావాలన్నారు. రెండు పోలియో చుక్కలు పిల్లల జీవితాంతం పోలియో రాకుండా కాపాడతాయన్నారు. గతంలో పిల్లలకు పోలియో చుక్కలు వేయించడంలో నిర్లక్ష్యం వహించడంతో ఎందరో చిన్నారులు పోలియో బారిన పడి, తమ నిండు జీవితాలను కకలావికం చేసుకున్న సందర్భాలు కొకొల్లలుగా ఉన్నాయన్నారు. ఇటీవల ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంఘాలు, ప్రజల్లో పూర్తి అవగాహన రావడంతో నేడు ఆంధ్రప్రదేశ్ పోలియో రహిత రాష్ట్రంగా మారుతుందన్నారు. కోరుకొండలో జనసేన పార్టీ నాయకులు తాటికొండ బుజ్జి కోరుకొండలో చిన్నారులకు పోలియోచుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిల్లి కృష్ణవేణి, తెదేపా నాయకులు కోర్పు నరేంద్ర, అడపా వీరబాబు, చిట్టిప్రోలు పద్దరాజు, ఏఎన్ఎం, ఆశ తదితరులు పాల్గొన్నారు.

# నేర చరిత్రను వీడి మంచి పౌరులుగా మెలగాలి - డీఎస్పీ జీవన

**కోరుకొండలో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్**



**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** గత జీవితంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా నేరపూరిత ఆలోచనలు విడనాడి సమాజంలో మంచి పౌరులుగా మెలగాలని రౌడీ షీటర్లకు ఉత్తర మండల డిఎస్పి జీవన హితవు పలికారు. ఆదివారం కోరుకొండ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు ఉత్తర మండల డీఎస్పీ జీవన,కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్వివిఎస్ మూర్తి ఆధ్వర్యంలో రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. కోరుకొండ సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన రౌడీ షీటర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి,వారి ప్రవర్తనపై ఉన్నతాధికారులు సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఉత్తర మండల డీఎస్పీ జీవన మాట్లాడుతూ గతంలో జరిగిన పొరపాట్లను,నేరపూరిత ఆలోచనలను విడనాడి సమాజంలో మంచి పౌరులుగా జీవించాలన్నారు. చట్టవ్యతిరేక పనులకు దూరంగా ఉంటూ, కష్టపడి పని చేసుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని సాగించాలన్నారు. ప్రశాంతమైన వాతావరణానికి భంగం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కోరుకొండ సీఐ మూర్తి మాట్లాడుతూ పోలీస్ శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తుందని, ప్రతి ఒక్కరి కదలికలను గమనిస్తున్నామన్నారు. ఎవరైనా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, తప్పుడు నడవడికతో ప్రవర్తిస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేయడానికి వెనుకాడబోమని తీవ్రంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ ఎస్సై వెంకట రమేష్, గోకవరం ఎస్సై పవన్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పల్స్ పోలియో కార్యక్రమంలో ఆదిత్య వాలంటీర్ల సేవలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ, జీవనది ఫౌండేషన్ నిర్వహణలో ఈరోజు ఆదివారం ఉదయం రాజమండ్రి ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.వి.ఎస్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో షెల్టన్ హోటల్ సమీపాన 16వ వార్డు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్) ప్రాంగణంలో వాలంటీర్లు ఎండిన చెట్లను,వ్యర్థ పదార్థాలను ప్లాస్టిక్‌ను తొలగించి ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జీవనది ఫౌండర్ ఇంటి లక్ష్మీ దుర్గ, వారి సభ్యులు సంతోష్ మరియు సోమశేఖర్, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ సభ్యులు జి.వి. రామారావు (సెక్రటరీ), కె.సుధాకర్ పట్నాయక్,ఆజాద్ రాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు. పల్స్ పోలియో వ్యాధి నిరోధక టీకా వేయించడంలో చిన్నారులకు సహకరించిన వాలంటీర్లకు ఆసుపత్రి సిబ్బంది శుభాభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ డాక్టర్ బిహెచ్. వి.రమాదేవి, పిఓలు పోలుకొండ సాయి, బి.విమల సహకరించారు.






ప్రభాస్ ఏ దేశం పోయినా

# ప్రైవసీ ఉండదు..

అందుకే ఆ దేశానికి మాత్రమే వెళ్తాడు.. ఈశ్వర్ నటుడు..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తొలి చిత్రం ఈశ్వర్ సమయంలో ఎంత అమాయకంగా, సిగ్గుపడేవాడో టాలీవుడ్ నటుడు కృష్ణ మాయ వివరించారు. సన్నివేశాల చిత్రీకరణలో అతని అంకితభావం, "వన్ మోర్" అనే ఆసక్తి, ఆ తర్వాత అతని ఎదుగుదల, నిరాడంబరత, స్నేహానికి ఇచ్చే విలువ వంటి అరుదైన విషయాలను పంచుకున్నారు. ఈశ్వర్ చిత్రంతో ప్రభాస్ చిత్రసీమలోకి అడుగుపెట్టినప్పటి రోజులను నటుడు కృష్ణ మాయ ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. అప్పట్లో ప్రభాస్ అమాయకత్వం, అంకితభావం, అలాగే సిగ్గుపడే స్వభావం వంటి అనేక ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ముఖ్యంగా రొమాంటిక్ సన్నివేశాలు, ముద్దు సీన్ల చిత్రీకరణ సమయంలో ప్రభాస్ సిగ్గుపడటం తరచుగా జరిగేదని ఆయన గుర్తు చేసుకున్నారు. ఆ రోజుల్లో డిజిటల్ కెమెరాలు లేకపోవడం, ఫిల్మ్ వాడకం చాలా ఖర్చుతో కూడుకున్నది కాబట్టి "వన్ మోర్" షాట్ అడిగే సందర్భాలు తక్కువగా ఉండేవని కృష్ణ మాయ వివరించారు. అయినప్పటికీ, ప్రభాస్ తన నటనపై ఎంత శ్రద్ధ పెట్టేవారంటే, ఒకసారి "వన్ మోర్" సార్ అని అడిగేవారని చెప్పారు. "ఏయ్ బాగుంది, బాగుంది" అని చెప్పి మానిటర్ కూడా చూసుకోకుండానే తదుపరి పనికి వెళ్ళిపోవాల్సి వచ్చేదని పేర్కొన్నారు. స్కూల్ దగ్గర షూటింగ్ జరుగుతున్నప్పుడు, చాలా మంది అమ్మాయిలు, అబ్బాయిలు గుమిగూడినప్పుడు ప్రభాస్ ఎంతగా సిగ్గుపడేవాడో కృష్ణ మాయ ఉదాహరణగా చెప్పారు. శ్రీదేవి సైకిల్ మీద వచ్చి పడిన సన్నివేశంలో, ఆమెను గట్టిగా కౌగిలించుకోవడానికి కూడా సిగ్గుపడ్డాడని, డైరెక్టర్ ప్రోత్సాహంతో ఆ సన్నివేశాన్ని పూర్తి చేశాడని ఆయన తెలిపారు. అప్పట్లో ఆ అమాయకత్వమే ప్రజలకు నచ్చిందని, అది అతని ఎదుగుదలకు ఒక కారణమని కృష్ణ మాయ తెలిపారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రభాస్‌కు లభించిన స్టార్‌డమ్, గుర్తింపు గురించి ప్రస్తావిస్తూ, అటువంటి స్థాయి ఉన్నప్పటికీ ప్రభాస్‌లో గర్వం ఎక్కడా కనిపించదని కృష్ణ మాయ పేర్కొన్నారు. తనకు ప్రైవసీ దొరకని స్థాయికి ఎదిగినప్పటికీ, తన స్నేహితుల పట్ల, సహనటుల పట్ల ఆయన చూపించే ఆదరణ అపారమైనదని చెప్పారు. తన జిమ్ ట్రైనర్ లక్ష్మణ్‌కు కోటి రూపాయల విలువైన రేంజ్ రోవర్ కారును బహుమతిగా ఇవ్వడం వంటి అనేక సహాయాలు ప్రభాస్ నిశ్శబ్దంగా చేస్తారని ఆయన గుర్తు చేసుకున్నారు. ఈశ్వర్ సినిమాలో నటించిన కొందరు వ్యక్తుల గురించి కూడా కృష్ణ మాయ ప్రస్తావించారు. పులి రాంబాబు అనే నటుడు, రోజుకు 15,000 రూపాయల రెమ్యునరేషన్ అందుకున్నప్పటికీ, చెడు అలవాట్లకు బానిసలై అనారోగ్యంతో మరణించారని చెప్పారు. అదేవిధంగా, అదృష్టం కలిసొచ్చి జబర్దస్త్ ద్వారా ప్రముఖుడైన అదిరే అభి, అలాగే హను కోట్లా వంటి వారు మంచి ప్రొఫెషన్లలో స్థిరపడ్డారని వివరించారు. హను కోట్లా ఇప్పుడు జీమీఖలో డీన్‌గా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభాస్ తన కెరీర్ ప్రారంభంలో ఎలా కష్టపడ్డారో కృష్ణ మాయ వ్యక్తిగత అనుభవాల ద్వారా పంచుకున్నారు. కృష్ణానగర్‌లో కెమెరామెన్ జవహర్ రెడ్డి, ప్రభాస్, కృష్ణ మాయ ముగ్గురూ కలిసి డెమో షూట్స్ కోసం తిరిగేవారని, అప్పట్లో ప్రభాస్‌ను "కొత్త కుర్రోడు సీరియల్ ట్రై చేస్తున్నాడు" అని చెప్పేవారని కృష్ణ మాయ నవ్వుతూ గుర్తు చేసుకున్నారు. కృష్ణంరాజు గారి అబ్బాయి అని చెప్పడం అనవసరం అని భావించేవారని, అది ప్రభాస్‌కు కూడా నచ్చేదని అన్నారు. ఈశ్వర్ ప్రివ్యూ చూసిన తర్వాతే ప్రభాస్ ఒక గొప్ప హీరో అవుతాడు అనే నమ్మకం అందరికీ కలిగిందని కృష్ణ మాయ తన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

చనిపోయినా ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపిన భాగ్యరాజ్..

# కళ్లను దానం చేసి ఆదర్శంగా నిలిచిన నటుడు



గుండెపోటుతో 73 ఏళ్ల వయసులో కన్నుమూసిన ప్రముఖ దర్శకుడు భాగ్యరాజ్, తన చివరి కోరిక ప్రకారం ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగు నింపారు. ఈ మేరకు వైద్యులు భాగ్యరాజ్ ఇంటికి చేరుకుని నేత్ర దానం ప్రక్రియను పూర్తి చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి తమిళ సినిమా దర్శకుడు, నటుడు, స్క్రీన్ రైటర్ కె. భాగ్యరాజ్ (73) శనివారం (జూన్ 27 ) చెన్నైలో తీవ్ర గుండెపోటుతో కన్నుమూసిన సంగతి తెలిసిందే. వైవిధ్యమైన సినిమాలు, విలక్షణమైన నటనతో దక్షిణాది చిత్ర పరిశ్రమలో 'స్క్రీన్ ప్లే కింగ్' గా గా గుర్తింపు పొందిన భాగ్యరాజ్ మరణం చిత్ర పరిశ్రమకు అలాగే కోట్లాది మంది అభిమానులకు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. సీఎం విజయ్ తో పాటు పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు భాగ్యరాజ్ ఇంటికి చేరుకుని ఆయనకు నివాళులు అర్పించాడు. నటుడితో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఇదిలా ఉంటే మరణానంతరం కూడా తన గొప్ప మనసును చాటుకున్నారు భాగ్యరాజ్. ఆయన కన్నుమూసిన కొన్ని గంటల్లోనే కుటుంబ సభ్యులు భాగ్యరాజ్ నేత్రాలను దానం చేసి సమాజానికి ఆదర్శంగా నిలిచారు. దాదాపు దశాబ్దాల క్రితమే తాను మరణించిన తర్వాత కళ్లు దానం చేస్తానని భాగ్యరాజ్ ప్రతిజ్ఞ చేశారు. ఆ మాటను నిలబెడుతూ ఆయన కుటుంబ సభ్యులు వెంటనే చెన్నైలోని ప్రముఖ కంటి ఆసుపత్రికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే నిపుణులైన వైద్యుల బృందం భాగ్యరాజ్ నివాసానికి చేరుకుని, నిర్దేశిత సమయంలోగా ఆయన నేత్రాలను అత్యంత భద్రంగా సేకరించారు. ఈ విషయం తెలుసుకున్న అభిమానులు భాగ్యరాజ్ రియల్ హీరో అంటూ ప్రశంసిస్తున్నారు. కాగా భాగ్యరాజ్ నివాసానికి వెళ్లి తుది నివాళులర్పించిన తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, తన ట్విట్టర్ ఖాతాలో ఇలా రాసుకొచ్చారు. 'కె. భాగ్యరాజ్‌కు తుది నివాళులర్పించడానికి వెళ్ళినప్పుడు, ఆయన తన కళ్లను దానం చేశారని నాకు తెలిసింది. మరణానంతరం కూడా ఒకరి జీవితంలో వెలుగులు నింపాలనే ఆయన ఆలోచనను ఎంత పొగిడినా తక్కువే. ప్రజా జీవితంలో గుర్తింపు పొందిన ఇంతటి ప్రముఖులు తమ కళ్లను దానం చేసినప్పుడు, అది ప్రజలలో గొప్ప అవగాహనను కల్పిస్తుంది' అని నటుడికి నివాళి అర్పించారు తమిళి సై. కాగా భాగ్యరాజ్‌కు భార్య పూర్ణిమ, కుమార్తెలు శరణ్య, శాంతను ఉన్నారు. కొద్ది రోజుల క్రితమే భాగ్యరాజ్ గురువు, ఆప్తమిత్రుడైన దర్శకుడు కె. భారతిరాజ్ కన్నుమూశారు. ఆ బాధ నుంచి తేరుకోకముందే భాగ్యరాజ్ మరణించడం తమిళ చిత్ర పరిశ్రమ తీవ్ర విషాదంలో మునిగిపోయింది.

# వారెవ్వా..! ఏముంది మావా ఈ సాంగ్.!!



ఇప్పుడు ఎక్కడ చూసిన ఫోక్ సాంగ్స్ హవ కనిపిస్తుంది. ప్రతి నెల పదుల సంఖ్యలో సాంగ్స్ విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అంతే కాదు సినిమా సాంగ్స్ కు మించి ఫోక్ సాంగ్స్ క్రేజ్ తెచ్చుకోవడంతో ఇప్పుడు చాలా మంది ఫోక్ సాంగ్స్ ను తెరకెక్కించడానికి ఆసక్తి చూపిస్తున్నారు. సినిమా ఇండస్ట్రీలో సాంగ్స్ కు ఎంత క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.. సినిమాల విజయంలో సాంగ్స్ ఎంతో కొంతం భాగం అవుతుంటాయి. కొన్ని సినిమాలు ఫ్లాప్ అయినప్పటికీ సాంగ్స్ సూపర్ హిట్ అవుతుంటాయి. అలాగే కొన్ని సాంగ్స్ రిపీట్ గా వింటూ ఉంటారు. ఇక ప్రస్తుతం సినిమా సాంగ్స్ తోపాటు ప్రయివేట్ సాంగ్స్ కూడా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అలాగే ఫోక్ సాంగ్స్ కూడా ప్రేక్షకులను విశేషంగా అలరిస్తున్నాయి. ఫోక్ సాంగ్స్ కు ఉండే క్రేజ్ గురుంచి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎన్నో సాంగ్స్ ఇప్పటికే యూట్యూబ్ ను షేక్ చేస్తున్నాయి. ఇక ఎన్నో సాంగ్స్ ఇప్పుడు సోషల్ మీడియాలోనే కాదు పాన్ ఇండియా లెవల్‌లో వైరల్ అవుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఇక ఇప్పుడు ఓ సాంగ్ యూట్యూబ్ ను ఊపేస్తోంది. ఈ ఫోక్ సాంగ్ ఇప్పుడు మిలియన్స్ కొద్దీ వ్యూస్ తో దూసుకుపోతుంది ఈ సాంగ్.. ఆడియన్స్ ఈ సాంగ్‌ను రిపీట్‌గా వింటూ తెగ వైరల్ చేస్తున్నారు. ఇంతకూ ఆ సాంగ్ ఏదో కాదు.. సక్కని నా బావ అలిగిండు అనే పాట తెగ వైరల్ అవుతుంది. ఈ పాటలో డాన్స్ కూడా అదిరిపోతుంది. ఈ సాంగ్ కు ఇప్పటికే 930కే పైగా వ్యూస్ సొంతం చేసుకొని దూసుకుపోతుంది. హేమ రెడ్డి ఈ సాంగ్‌కు సాహిత్యం అందించారు. ఆమె రాసిన లిరిక్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. అలాగే మమత రమేష్ ఈ సాంగ్‌ను అద్భుతంగా ఆలపించారు. డీజే శేఖర్ ఇచ్చోడ ఈ సాంగ్ కు మ్యూజిక్ అందించారు. అలాగే ఈ సాంగ్ లో మాధురి రాథోడ్, రౌడీ హరీష్ నటించి మెప్పించారు. ఈ సాంగ్‌లో మాధురి రాథోడ్ తన అందంతో పాటు డాన్స్ కూడా ఆకట్టుకుంది. ఈ సాంగ్ మేకింగ్ కూడా ఆడియన్స్ ను అట్రాక్ట్ చేస్తుంది. ఈ సాంగ్ పై మీరూ ఓ లుక్కేయండి.

క్రీడా వాయిస్ - మీ క్రీడా వార్తల స్వరము

టీజీ20 లీగ్.. ఉత్కంఠ పోరులో

# కరీంనగర్‌దే విజయం

టీజీ20 లీగ్ 2026లో కరీంనగర్ డైమండ్స్ బోణీ చేసింది. ఆదివారం వరంగల్ వారియర్స్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో రెండు పరుగుల తేడాతో విజయం సాధించింది. 210 పరుగుల లక్ష్యఛేదనలో వరంగల్ 6 వికెట్లు కోల్పోయి 207 పరుగులు చేసింది. రిషికేత్ సిసోదియా (65; 31 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్స్‌లు), భవేశ్ సేథ్ (53లి; 27 బంతుల్లో 6 సిక్స్‌లు) పోరాడినా జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయారు. హర్షిత్ చౌదరి (31), శౌనక్ కులకర్ణి (14లి) పరుగులు చేశాడు. కరీంనగర్ బౌలర్లలో సతీష్ కుమార్ 2 వికెట్లు పడగొట్టాడు. శుభమ్ శర్మ, దినేశ్, హరీశ్ ఠాకూర్, ఆశిష్ శ్రీవాస్తవ్ తలో వికెట్ తీశారు. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన కరీంనగర్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 209 పరుగులు చేసింది. కెప్టెన్ తన్మయ్ అగర్వాల్ (133; 61 బంతుల్లో 15 ఫోర్లు, 7 సిక్స్‌లు) 'శత'క్కొట్టాడు. ఓపెనర్ సాత్విక్ రెడ్డి (4) తొలి ఓవర్‌లోనే వెనుదిరిగినా.. తన్మయ్ మిగతా బ్యాటర్ల సాయంతో ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. 27 బంతుల్లో హాఫ్ సెంచరీ, 52 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. హృషికేశ్ సింహ (24), చందన్ సహాని (16), రాహుల్ రాదేశ్ (15లి) పరుగులు చేశారు. వరంగల్ బౌలర్లలో ముదస్సర్ హుస్సేన్ 2, ఆది మణి కిరణ్, శౌనక్ కులకర్ణి, మురుగన్ అభిషేక్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

భారత్ ఎ - శ్రీలంక ఎ

# తొలి అనధికారిక టెస్టు మ్యాచ్ డ్రా



శ్రీలంక ఏ - భారత్ ఏ జట్ల మధ్య నాలుగు రోజుల అనధికారిక తొలి టెస్టు డ్రా అయింది. ఫలితం తేలేలా అనిపించకపోవడంతో ఇరు జట్ల సారథులు డ్రాకు అంగీకరించారు. ఈ సిరీస్‌లో ఆఖరి అనధికారిక టెస్టు జులై 2 నుంచి ప్రారంభం కానుంది. మొదటి అనధికారిక టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ ఏ 452/6 స్కోరు డిక్లేర్డ్ చేయగా.. శ్రీలంక 330 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్ అకిబ్ నబీ (4/58)తోపాటు యశ్ ఠాకూర్ 2, హర్ష్ దూబే 2.. అన్షుల్ కాంబోజ్, శరాన్ష్ జైన్ ఒక్కో వికెట్ తీశారు. దీంతో భారత్‌కు 122 పరుగుల తొలి ఇన్నింగ్స్ లీడ్ లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో 189/8 స్కోరు వద్ద భారత్ డిక్లేర్ చేసింది. తరువాత 312 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన శ్రీలంక ఆట ముగిసేసరికి 2 వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసింది. వర్షం కారణంగా ఆటకు అంతరాయం కలిగింది. కేవలం 55 ఓవర్ల ఆట మాత్రమే సాగింది. దాదాపు ఒక సెషన్ మొత్తం వర్షం దెబ్బకు తుడిచిపెట్టుకుపోయింది.

# కావ్య మారన్‌తో అనిరుధ్ పెళ్లి..

ఆసక్తికర విషయం పంచుకున్న నటుడు



సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు సీఈవోగా వ్యవహరిస్తున్న కావ్య మారన్ కొంతకాలంగా రిలేషన్‌షిప్‌లో ఉన్నారని, త్వరలోనే పెళ్లి చేసుకోనున్నారని కొంతకాలంగా వార్తలొస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లోనూ చర్చ జరిగింది. ఈ ప్రచారాన్ని అనిరుధ్ ఖండించారు. అయితే, తాజాగా వీరి వివాహం గురించి మరో వార్త బయటికొచ్చింది. అనిరుధ్, కావ్య మారన్ త్వరలో పెళ్లి పీటలు ఎక్కబోతున్నారని అనిరుధ్‌కు బంధువైన సీనియర్ నటుడు వై.జీ. మహేంద్రన్ ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. వీరి పెళ్లికి ఇరుకుటుంబాల పెద్దలు కూడా ఓకే చెప్పినట్లు తెలిపారు."అనిరుధ్ మృదు స్వభావి. నాకు తెలిసినంతవరకు వాళ్లిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారు. ఆ అమ్మాయి ఆర్డినరీ గర్ల్ కాదు. అంత పెద్ద జట్టును నిర్వహించగల సామర్థ్యం ఆమెకు ఉంది. ఆమె తన తండ్రి నుంచి వ్యాపార నైపుణ్యాలను పుణికిపుచ్చుకుంది. అనిరుధ్, కావ్య మారన్ మంచి జంట" అని పేర్కొన్నారు. కావ్య.. సన్ గ్రూప్ ఛైర్మన్ కళానిధి మారన్ కుమార్తె. ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో మైదానంలో తనదైన హావభావాలతో పాపులర్ అయ్యారు. కళానిధి మారన్ నిర్మించిన 'జైలర్', 'బీస్ట్', 'రాయన్' తదితర చిత్రాలకు అనిరుధ్ సంగీతం అందించారు.

# చరిత్ర సృష్టించిన ఆఫ్రికా దేశాలు..



ఫిఫా ప్రపంచ కప్‌లో ఇప్పటి వరకు ఓ లెక్క.. ఇక నుంచి మరో లెక్క.. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన వరల్డ్ కప్‌లో లీగ్ స్టేజ్ ముగిసింది. 48 జట్లు బరిలోకి దిగగా.. నాకౌట్ స్టేజ్‌కు 32 అర్హత సాధించాయి. ఇక్కడ్నుంచి ఎవరు గెలిస్తే వారే ముందడుగు వేస్తారు. మిగతా జట్లు ఇంటిముఖం పడతాయి. ఈ క్రమంలో ఆఫ్రికా దేశాలు ఫిఫా ప్రపంచ కప్‌లో సరికొత్త చరిత్రను లిఖించాయి. మరి ఆ ఘనత ఏంటి? అలాగే 'రౌండ్ 32'లో తలపడే జట్లేవో కూడా ఓ లుక్కేద్దాం.. నాకౌట్‌లో అడుగు పెట్టిన 32 జట్లలో తొమ్మిది ఆఫ్రికా దేశాలు కావడం గమనార్హం. ఒకే వరల్డ్ కప్‌లో ఆఫ్రికాకు చెందిన టీమ్‌లు రెండు మాత్రమే గతంలో నాకౌట్‌కు చేరేవి. అదీనూ 2014, 2022 ప్రపంచ కప్‌ల్లో జరిగింది. ఈసారి మాత్రం ఏకంగా 10 టీముల్లో 9 దూసుకొచ్చాయి. అందులో అతిచిన్న దేశం కేప్ వెర్దె కూడా ఉంది. మిగతా జట్లలో మొరాకో, దక్షిణాఫ్రికా, సెనెగల్, ఐవరీ కోస్ట్, ఘనా, ఈజిప్ట్, కాంగో, అల్జీరియా కూడా అర్హత సాధించాయి. ఇక ప్రపంచ కప్‌లో సెమీస్‌కు చేరిన ఏకైక జట్టు దక్షిణాఫ్రికా. నాలుగేళ్ల కిందట ఖతార్ వేదికగా జరిగిన ఫిఫా వరల్డ్ కప్‌లో సఫారీ జట్టు సెమీఫైనల్‌లో అడుగు పెట్టింది. మరి ఇప్పుడు ఎన్ని జట్లు వెళ్తాయో చూడాలి. రౌండ్32లో గెలిచిన జట్టు రౌండ్ 16కు వెళ్తుంది. అక్కడ నుంచి క్వార్టర్స్ ఫైనల్స్‌కు ఎనిమిది టీమ్‌లు వెళ్తాయి. క్వార్టర్స్‌లో గెలిచిన నాలుగు టీమ్‌లు సెమీస్‌లో తలపడాయి. అక్కడ్నుంచి ఫైనల్‌లో కప్పు కోసం ఢీకొట్టుకుంటాయి.

**రౌండ్ 32 పోరు ఇలా..**

'రౌండ్ 32'కు అర్హత సాధించిన జట్ల మధ్య సోమవారం నుంచి మ్యాచులు ప్రారంభమవుతాయి. మొత్తం 16 మ్యాచుల్లో విజేతలుగా నిలిచిన టీమ్‌లు రౌండ్16 లేదా ప్రిక్వార్టర్స్‌లో తలపడతాయి. ఓడిన టీమ్ ఇంటిముఖం పట్టాల్సిందే. ఇక్కడ డ్రా అనే మాటే ఉండదు. నిర్ణీత సమయం, అదనపు సమయంలోగా ఎవరూ గోల్స్ చేయకపోతే.. పెనాల్టీ షూటౌట్ ద్వారా విజేతను నిర్ణయిస్తారు.

**సాటిలేని లియోనెల్ మెస్సి.. ఫిఫా ప్రపంచ కప్‌లో తొలి ప్లేయర్‌గా ఘనత**

ఫిఫా ప్రపంచ కప్‌లో అర్ధరాత్రి నుంచి ఇప్పటి వరకు ఆరు మ్యాచులు జరిగాయి. స్టార్ ప్లేయర్లు లియోనెల్ మెస్సి, క్రిస్టియానో రొనాల్డో బరిలోకి దిగారు. ఈ క్రమంలో మెస్సి ప్రపంచ రికార్డు నమోదు చేయగా.. రొనాల్డో తన జట్టు తరఫున గోల్ చేయడంలో విఫలం కావడం గమనార్హం. ఇప్పటికే రౌండ్ 32లో పోటీ పడే జట్లేవో తేలిపోయాయి.

**వరుసగా ఏడు మ్యాచుల్లోనూ మెస్సి గోల్**

లియోనెల్ మెస్సి మాయ ఎలా ఉందంటే.. అతడు బరిలోకి దిగితే అర్జెంటీనాకు గోల్ వచ్చినట్లే. ప్రపంచ కప్ 2026లో తాను ఆడిన మొదటి పోరులోనే మెస్సి హ్యాట్రిక్ సాధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు జోర్డాన్‌పై గోల్ కొట్టి అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. ప్రపంచ కప్ పోటీల్లో వరుసగా ఏడు మ్యాచుల్లోనూ గోల్ చేసిన తొలి ప్లేయర్‌గా రికార్డు సృష్టించాడు. ఇప్పటికే నాకౌట్‌కు చేరుకున్న అర్జెంటీనా 3-1 తేడాతో జోర్డాన్‌ను ఓడించి హ్యాట్రిక్ విక్టరీ సాధించింది. గ్రూప్ జీ నుంచి తలపడిన అల్జీరియా - ఆస్ట్రియా మ్యాచ్ 3-3తో డ్రాగా నిలిచింది. అర్జెంటీనాతోపాటు ఈ రెండు జట్లూ నాకౌట్‌కు చేరుకున్నాయి.

**మళ్లీ విఫలమైన రొనాల్డో**

ఫిఫా ప్రపంచ కప్ 2026లో క్రిస్టియానో రొనాల్డో ప్రదర్శన ఆశించినంత మేర లేదు. తాను ఆడిన తొలి మ్యాచ్‌లో ఒక్క గోల్ చేయని అతడు.. మళ్లీ ఇప్పుడు కొలంబియాపైనా గోల్ కొట్టడంలో విఫలమయ్యాడు. కొలంబియాతో జరిగిన పోరును పోర్చుగల్ 0-0తో డ్రా చేసుకుంది. దీంతో గ్రూప్ ఖ నుంచి కొలంబియా అగ్రస్థానంతో నాకౌట్‌కు చేరుకోగా.. పోర్చుగల్ రెండో ప్లేస్‌తో రౌండ్ 32కి అర్హత సాధించింది. పోర్చుగల్ మూడు మ్యాచుల్లో ఒక్క విజయం మాత్రమే నమోదు చేసి.. రెండింటిని డ్రా చేసుకుంది.

**ఆ మూడు జట్లకు విజయాలు..**

ఫిఫా ప్రపంచ కప్‌లో క్రొయేషియా, ఇంగ్లాండ్, డీఆర్ కాంగో తమ చివరి లీగ్ మ్యాచుల్లో విజయాలను సాధించాయి. ఇంగ్లాండ్ 2-0 తేడాతో పనామాను ఓడించింది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com